డంపింగ్‌యార్డ్‌ను నిలిపివేయాలని సీపీఐ ఎమ్మెల్యేకి వినతి



నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని నల్లవల్లి పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేసేలా చర్యలు తీసుకో వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావుకు స్థానిక రైతులు మండల జేఏసీ ఆధ్వ ర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. డంపింగ్ యార్డ్ వల్ల సుమారు 5000 ఎకరాల పంట పొలాలు నాశనమవుతాయని ఆందోళన వ్యకతం చేశారు. గొలుసుకట్టు చెరువులు, కుంటలతో పాటు పచ్చని పల్లె వాతావరణంలో వాయు, గాలి, వాతావరణ కాలుష్యం జరుగుతుందని ఆయనకు వివరిం చారు. అందుకు సాంబశివరావు స్పందిస్తూ.. వీటి పూర్తి వివరాలను అధ్యయనం చేసిన తర్వాత అసెంబ్లీలో తాను డంపింగ్ యార్డ్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తానని మాట ఇచ్చారని జేఏసీ సభ్యులు మద్దుల బాల్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండల జేసి నాయకులు తదితరులు పాల్గొన్నారు

నవతెలంగాణ
మెదక్

1

శుక్రవారం | 14 మార్చి 2025 | www.navatelangana.com

37వ రోజుకు నిరవధిక నిరసనలు



నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని నల్లవల్లి పంచా యతీ పరిధిలో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్‌ను వ్యతిరేకిస్తూ స్థానిక గ్రామాల ప్రజలు చేస్తున్న నిరవధిక సమ్మె గురువారం నాటికి 37వ రోజుకు చేరింది. గత 37 రోజుల నుంచి నిరవ ధిక సమ్మె చేపడుతున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవడం విచారకమని.. నిరసనల్లో పాల్గొన్న నల్లవల్లి, కొత్తపల్లి, గుమ్మడిదల గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. డంపింగ్ యార్డ్ ఏర్పాటును రద్దు చేయాలని కోరారు. లేని యెడల ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. అంతేకాకుండా జేఏసీ ఆధ్వర్యంలో ఉన్నత న్యాయ స్థానాన్ని కూడా ఆశ్రయిస్తామన్నారు. డంపింగ్ యార్డ్ ఎత్తివేసే వరకు పోరాటం ఆగదని.. ఎంతమంది పోలీసు బలగాలను పెట్టుకున్న ప్పటికీ ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు.

మంజీరా నీటిని ప్రతిరోజు సరఫరా చేయాలి

- 5 రోజుల నుంచి నీటి సరఫరా లేక ఇబ్బందులు
- ఆదిత్య నగర్ కాలనీ అధ్యక్షులు జి.సాయిలు
- మున్సిపల్ ఆఫీస్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-సంగారెడ్డి

మంజీరా నీటిని ప్రతిరోజు సరఫరా చేయాలని ఆదిత్య నగర్ కాలనీ అధ్యక్షులు జి.సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదిత్యనగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డి మున్సిపల్ ఏఈకి గురువారం వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు జి.సాయిలు మాట్లాడు తూ.. సంగారెడ్డి పట్టణం 33 వార్డులోని ఆదిత్యనగర్, వసం తనగర్, రెవెన్యూ కాలనీ, బర్మా కాలనీ, ఓడిఎఫ్ కాలనీ, 20:20 కాలనీల్లో మంజీర నీరు గత 5 రోజుల నుంచి రావట్లేదన్నారు. దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భూగర్భ జలాల్లో నీరు లేక బోర్లలో నీరు రావడం లేదన్నారు. వేసవికాలంలో నీటి ఎద్దడి రాకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. వారం రోజులుగా నీరు లేక ప్రజలు తల్లడిల్లుతుంటే మున్సిపల్ అధికారులు ఎందుకు స్పందించడం లేదన్నారు. నిర్లక్ష్యం విడనాడి ప్రతిరోజు నీటిని సరఫరా చేసే విధంగా మున్సిపల్ అధికారులు, జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికైనా ప్రతి రోజు మంజీరా నీటిని సరఫరా చేసి కాలనీ వాసులను ఆదుకోవాలని కోరారు. అనంతరం ఏఈకి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు వేణు గోపాల్ రాజేంద్రప్రసాద్, సంతోష్, రవి, దత్తు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మురికి కాల్వల నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-నారాయఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ మున్సిపాల్టీ పరిధిలోని నాలుగో వార్డ్‌లో గల బైపాస్ రోడ్డు సమీపంలో పలు కాలనీల్లో గత కొన్నేండ్లుగా మురికి కాలువలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయమై ఆయా కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో.. ఆయన ఆదేశాలతో మున్సిపల్ తాజా మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్ గురువారం మురికి కాలువల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా దారం శంకర్ మాట్లాడు తూ.. స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సహకారంతో ప్రజల ప్రధాన అవసరాలైన మురికి కాలువలు, సీసీరోడ్లు, తాగునీటి సదుపాయాలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నా మన్నారు. ఈ సందర్భంగా ఈ అభివృద్ధి కార్యక్రమాలు చకచకా కొనసాగించడంతో ఆయా కాలనీవాసులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు విరామం లేని విద్యుత్ అందించాలి



నవతెలంగాణ-జిన్నారం

రైతులకు విరామం లేకుండా నిరంతరం విద్యుత్ అందించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని జంగపేట్, దాదిగూడెం గ్రామాల్లో రైతులను పొలాలను క్షేత్రస్థాయిలో గుమ్మడిదల విద్యుత్ శాఖ ఏడీఈ దుర్గాప్రసద్ బృందం గురువారం సందర్శించారు. రైతులతో మాట్లాడుతూ.. వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో టాన్స్‌ఫార్మర్ల పనితీరు, విద్యుత్ సరఫరాలో ఏవైనా ఇబ్బందులు ఉంటే సిబ్బంది దృష్టికి తీసుకురావాలని రైతాంగానికి సూచించారు. సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని లైన్‌మెన్‌లకు సూచించారు. సమస్యల పట్ల స్పందించని విద్యుత్ సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుం టామని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం ఏ.ఈ. వెంకటేశ్వర్లు రైతులు గోవర్ధన్ రెడ్డి, కొర్వి కుమార్, యాదగిరి, నరసింహ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

హోలీ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి నియోజకవర్గ, జిల్లా ప్రజలకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హోలీ పండుగ శు భాకాంక్షలు తెలిపారు. ప్రేమ, ఆప్యాయత సంతోషాల హరివిల్లుగా, శాంతి సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే హోలీ రంగుల పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. వసంతాన్ని తమ జీవితాల్లోకి ఆహ్వానిస్తూ జరుపుకునే హోలీ పర్వదిన సందర్భంగా ఆ ప్రకృతీమాత ప్రజలందరినీ చల్లగా చూడాలన్నారు.

విద్యార్థులు ఆడుతూ పాడుతూ విద్యనభ్యసించాలి



నవతెలంగాణ-జహీరాబాద్

విద్యార్థులు ఆడుతూ పాడుతూ విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఇంపాక్ట్ ట్రైనర్ సంగీత పాటిల్ అన్నారు. స్థానిక మాణిక్ ప్రభు ఉన్నత పాఠశాలలో 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం గురించి గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేడు విద్యార్థులు విద్యను భారంగా భావిస్తున్నారని.. దాంతో రాబోవు తరగతుల్లో ఎన్నో ప్రమాదాలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. విద్యతో తమకంటే ముందున్న వారిని స్ఫూర్తిగా తీసుకుని చదవాలన్నారు.గాయత్రి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శాంతికుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నప్పటి నుంచి క్రమశిక్షణతో ఉండాలని.. వారు మాత్రమే వివిధ రంగాల్లో రాణించగలుగు తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాణిక్ ప్రభు పాఠశాల హెచ్ఎం వెంకటయ్య సిబ్బంది అరుణ, నాగజ్యోతి, శివశంకర్, స్వరూప, మధు తదితరులు పాల్గొన్నారు.



- రోజురోజుకు పెరుగుతున్న కుక్క కాటు బాధితులు
- 14 నెలల్లో రామాయంపేటలోనే 512 కుక్క కాటు కేసులు
- పిల్లలు బయటికి వెళ్తే ప్రాణాలు అరచేతిలోనే..
- కుక్కలను చంపడం చట్టబద్ధం కాదనే అబద్ధపు నెపంతో..
- తప్పించుకుంటున్న సంబంధిత అధికారులు
- దుర్గమ్మ బస్తీలో ఓ మహిళపై ఒకే నెలలో రెండు సార్లు దాడి

నవతెలంగాణ-రామాయంపేట

ఊర కుక్కల బెడద రోజు రోజుకు పెరుగుతోంది. వీధుల్లో గుంపులుగా తిరుగుతూ, దారిన వెళ్లే వారిపై దాడికి పాల్పడు తున్నాయి. చిన్నారులు, వృద్ధులు, మహిళలు వీధుల్లో నడవలేని భయానక పరిస్థితులు సృష్టిస్తున్నాయి. కుక్క కాటు కేసులు రోజురోజుకు పెరుగుతున్నా, మున్సిపల్ అధికారులు, సంబంధిత అధికారులు "కుక్కలను చంపడం చట్టబద్ధం కాదు" అనే అబద్ధపు నెపంతో చేతులు మూసుకుని కూర్చుంటున్నారు. కానీ ప్రభుత్వ చట్టాల ప్రకారం ప్రజలకు ముప్పుగా మారిన కుక్కలను నియం త్రించి, అవసరమైతే చంపే హక్కు అధికారులకు ఉంది.

14 నెలల్లో రామాయంపేటలోనే 512 కుక్కకాటు కేసులు

గత సంవత్సరం జనవరి నెల నుంచి ఈ సంవత్సరం ఫిబ్రవరి నెల వరకు గడిచిన 14 నెలల కాలంలో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో 512 కుక్కకాటు కేసులు నమోదయ్యాయి అంటే, పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ సంవత్సరం జనవరి, ఫిబ్రవరి రెండు నెలల్లోనే రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో 88 కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. ప్రతినెల కుక్క కాటు కేసుల సంఖ్య పెరుగుతూనే వస్తుంది.

ప్రతి వీధిలో భయానక వాతావరణం!

గత నెల రోజుల కాలంలో రామాయంపేట పట్టణంలోని దుర్గమ్మ బస్తీకి చెందిన బసన్నపల్లి లక్ష్మి అనే ఓ మహిళపై ఓ కుక్క రెండుసార్లు దాడి చేసింది. ఉదయం వేళ ఇంటి ముందు ముగ్గు వేస్తుంటే దాడికి పాల్పడినట్టు బాధితురాలు తెలిపింది. రామా యంపేట పట్టణంలో వృద్ధులు, మహిళలు బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. ప్రధానంగా పిల్లల్ని స్కూలు కోసం, ఇతర పనుల నిమిత్తం బయటకు పంపాలంటే తల్లిదండ్రులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నారు. ఇంటి ముందు కూర్చోవాలన్నా, దారిలో నడవాలన్న, బైక్‌పై వెళ్లాలన్నా తీవ్రంగా భయపడు తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చట్టం ఏమంటోంది?

కుక్కల్ని చంపడం చట్టబద్ధం కాదనే అబద్ధపు నెపంతో అధికారులు మౌనం దాల్చినప్పటికీ, ప్రజలకు ముప్పుగా మారిన వీధి కుక్కలను చట్టబద్ధంగా తొలగించేందుకు నిబంధనలు ఉన్నాయనే విషయం చాలా మందికి తెలియదు. జంతువుల పట్ల క్రూరత్వ నిరోధక చట్టం, 1960 సెక్షన్ 11(3)(బి) ప్రకారం ప్రజలకు ప్రాణహాని కలిగించే కుక్కలను పశువైద్యుల సూచన మేర కు హ్యూమన్ పద్ధతిలో చంపే అవకాశం ఉంది. అలాగే మున్సిపల్ అధికారులు, పంచాయితీ అధికారులు కుక్కల్ని పట్టుకొని, పశు వైద్యాధికారుల సహకారంతో కుటుంబ నియంత్రణ చేయాల్సి ఉంటుంది. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా, అవగాహన లోపంతో అలాంటి చర్యలు తీసుకోకపోవడంతో గ్రామాలలో భయా నక పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

పరిష్కార మార్గాలు

ప్రజల ప్రాణాలు పోయేంత వరకు చూడకుండా, సంబంధిత అధికారులు ప్రమాదకర కుక్కలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వీధి కుక్కల జనాభా నియంత్రణ కోసం స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కార్యక్రమాలను వేగవంతం చేయాలి. ప్రజల భద్రత కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి, ఫిర్యాదులకు తక్షణం స్పందించాలి. కుక్కల బెడద నియంత్రణ కోసం మున్సిపల్, పంచాయతీ అధికారులు, పశువైద్యాధికారులు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టాలి.

వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం

రామాయంపేట పట్టణంలో ఊర కుక్కల నివారణకు చర్యలు తీసుకుం టామని మున్సిపల్ కమిషనర్ దేవేందర్ తెలిపారు. త్వరలోనే కుక్కల కుటుంబ నియంత్రణ సెంటర్ మెదక్‌లో ప్రారంభం అవుతుందని, అనంతరం కుక్కల నివా రణకు చర్యలు వేగవంతం చేస్తామన్నారు. మనుషుల ప్రాణాలకు ప్రమాదకరంగా మారిన కుక్కలను చంపడానికి ఎలాంటి చట్టం లేదని ఆయన తెలిపారు.

-మున్సిపల్ కమిషనర్

అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- ఆస్ట్రియాలోని ఏటీఅండ్ఎస్ గ్లోబల్ డైరెక్టర్ డాక్టర్ వెంకట్



నవతెలంగాణ-పటాన్‌చెరు

అభివృద్ధి చెందుతున్న అధునాతన సాంకేతికతలను వర్ధమాన ఇంజనీర్లు అందిపుచ్చుకోవాలని ఆస్ట్రియాలోని ఏటీఅండ్ఎస్ ఏజీలో అప్లికేషన్ ఇంజనీరింగ్ గ్లోబల్ డైరెక్టర్ డాక్టర్ వెంకట్ మొక్కపాటి సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'అధునాతన సెమీకండక్టర్ ప్యాకేజింగ్ టెక్నిక్స్'పై గురువారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. టూడీ, త్రీడీ, అభివృద్ధి చెంద తున్న ఫోర్ డీ ప్యాకేజింగ్ తో సహ సెమీ కండక్టర్ ప్యాకేజి ంగ్ టెక్నాలజీలలో తాజా పురోగతుల గురించి డాక్టర్ మొక్క పాటి విలువైన సమా చారాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. ఫోర్ డీ పరిజ్ఞానంలోని మడత లేదా వంపు ద్వారా అన్ని భాగాలకు విద్యుత్ కనెక్టివిటీని పెంచుతుందన్నారు. బాల్ గ్రిడ్ అర్రే, చిప్ స్కేల్ ప్యాకేజీ, కోర్ లెస్ ప్యాకేజింగ్ వంటి ఆధునిక ప్యాకేజింగ్ నిర్మాణాలలో ఉపయోగించే అధు నాతన బిల్డ్-అప్ మెటీరియల్ లకు పెరుగుతున్న డిమాం డ్‌ను వివరించారు. ప్యాకేజింగ్ పనితీరును మెరుగుప రచడానికి ఫైన్ లైన్, స్పేస్, ఫైన్ వయా పిచ్, క్యూరింగ్, రీఫ్లో సమయంలో తక్కువ వార్ ఫేజ్, అధిక ఇన్సు లేషన్ విశ్వసనీయత వంటి కీలక అంశాలను డాక్టర్ మొక్కపాటి వివరించారు. ఈ ఉపన్యాసం హై-ఫెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ (హెచ్ పీసీ) వెనుక ఉన్న ఆర్కి టెక్చర్, భవిష్యత్ ఆవి ష్కరణలను నడిపించే సెమీకండక్టర్ చిప్ లతో సహ ముఖ్యమైన పరిశ్రమ మార్పులను డాక్టర్ మొక్కపాటి వివరించారు. భారతదేశంలో విస్తరిస్తున్న సెమీకండక్టర్ తయారీ రంగంపై విలువైన సమా చారాన్ని అందించారు. ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి, కార్యక్రమ నిర్వా హకుడు ప్రొఫెసర్ ఎం.ప్రశాంత రెడ్డి అతిథిని సత్కరించి, ఆయన అమూల్యమైన సమయాన్ని గీతం విద్యార్థుల కోసం కేటాయించి, అధునాతన సాంకేతికతపై అవగాహన పెంచినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

దుర్గం చెరువు వద్ద కార్యశాల..

దుర్గం చెరువు సమీపంలోని పచ్చని అందాలు, చల్లని మలయమారుతాల మధ్య 'బ్లాంక్ కాన్వాస్ నుంచి మాస్టర్ పీస్ వరకు' అనే ఇతివృత్తంతో గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కార్యశాల నిర్వహించింది. ఇందులో బాలల నుంచి వయో జనుల వరకు, అన్ని వయస్సుల వారు పాల్గొని, తమ సృజ నాత్మకతకు పదును పెట్టారు.డ్రాయింగ్ వేయడాన్ని నేర్చుకో వడం ఆరంభించిన వారి నుంచి అనుభవజ్ఞులైన కళాకారుల వరకు అందరూ తరలివచ్చి, చార్ కోల్ డ్రాయింగ్ పట్ల తమ ప్రేమను ప్రదర్శించారు. వారి ఉత్సాహం, ప్రతిభ ఈ కార్యక్రమాన్ని చాలా ప్రత్యేకంగా చేసింది.

బడ్జెట్‌లో దళితుల జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించాలి

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిస్కైలాబ్ బాబు



నవతెలంగాణ-సంగారెడ్డి

ఈనెల 19న ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో దళితుల జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించాలని.. చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు కోసం బడ్జెట్‌లో సరిపడే నిధులు కేటాయించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ.స్కైలాబ్ బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డి కేవల్ కిషన్‌భవన్‌లో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) సంగారెడ్డి జిల్లా విస్తృత స్థాయి సమా వేశాన్ని సంఘం జిల్లా అధ్యక్షులు అతిమేల మాణిక్ అధ్య క్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా స్కైలాబ్ బాబు హాజరై మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేవెళ్ల ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్‌లో ప్రకటించిన విధం గా దళిత నిరుద్యోగులకు రూ.12 లక్షల అంబేద్కర్ అభయ హస్తం ఇవ్వాలన్నారు. యేటా రూ.750 కోట్లు అంబేద్కర్ అభయహస్తం స్కీంకుఇస్తామన్న మాట నిలబెట్టుకో లేద న్నారు. దళితుల కోసం మూడు కార్పొరేషన్లు నియమిస్తామన్న మాట నీటిమూటలాగా మారిందన్నారు. కుల దురహంకార హత్యలు పెట్రేగిపోతున్నాయని.. కులాంతర వివాహితుల రక్షణ చట్టం కోరుతూ తెలంగాణ అసెంబ్లీ తీర్మాణం చేయాలన్నారు. ప్రణయ్ హత్య కేసు కేసుకు సంబ ంధించి ఇటీవల నల్గొండ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు ఇచ్చిన తీర్పు పట్ల కేవీపీఎస్ హర్షం వ్యక్తం చేస్తున్నదన్నారు. ఏప్రిల్ నెల మహనీయుల మాసంగా ప్రకటించుకుని పూలే అంబే ద్కర్ జన జాతర నిర్వహించనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో నేటికీ హోటల్లో రెండు గ్లాసుల పద్ధతి, ఆలయంలోకి ప్రవే శం లేకపోవడం, కొన్ని గ్రామాల్లో బతుకమ్మ ఆడనీయక పోవటం, రచ్చబండల మీద కూర్చొనియ్యక పోవడం, పట్టణ ప్రాంతాల్లో దళితులకు ఇల్లు అద్దెకి ఇవ్వకపోవడం వంటి వివక్ష రూపాలు కొనసాగుతున్నాయన్నారు. ఈ వివక్ష రూపాలపై ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అతిమేల మాణిక్ మాట్లాడుతూ.. జిల్లాల అనేక నేటికీ కులవక్ష కొనసాగుతుందన్నారు. సంగారెడ్డి సిటీలో సైతం దళితులకు ఇండ్లు అద్దకు ఇవ్వడం లేదని వాపోయారు. 1955 పౌర హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారంగా కుల వివక్ష ఉన్న గ్రామాలను గుర్తించి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే విధంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కళాకారుల చేత కుల వివక్షకు వ్యతిరేకంగా ప్రత్యేక క్యాంపేయన్ నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పెద్దాపురం అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు మద్దూరి శివకుమార్, రాజు, జిల్లా సహాయ కార్యదర్శులు ప్రవీణ్,దాస్,మల్లేష్ నాయకులు బాబురావు, ప్రవీణ్, నర్సింలు, గంగారం, జయరాం, అశోక్, శ్రీనివాస్ ప్రభు, రాజేష్, దత్తు, మైపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి బడ్జెట్లో 30శాతం నిధులు కేటాయించాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్లో 30శాతం నిధులు కేటాయించాలని, పెండింగ్ స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతీ ఏడాది విద్యా రంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయం జరుగుతుం దన్నారు. గడిచిన పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యా రంగాన్ని భ్రష్టు పట్టించిందన్నారు. అధికారంలోకి రాగానే విద్యారంగాన్ని అభివృద్ధి పరుస్తామని కాంగ్రెస్ చెప్పిన ప్పటికీ.. అధికారం లోకి వచ్చి15 నెలలు అవుతున్నా అమలు చేయడం లేదన్నారు. పెండింగ్స్ స్కాలర్షిప్స్ ఫీజు రియంబ ర్స్మెంట్ వేలాది కోట్లు ఉన్నాయని.. వాటిని విడుదల చేయక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నార న్నారు. ఒకవేపు కళాశాల యాజమాన్యాలు ఫీజుల పేరుతో విద్యార్థులను వేధిస్తున్నారన్నారు. గురుకులాలు సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు అద్దె భవనాలల్లో కాలం వెళ్లదీ స్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయా లన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిధులను పెంచి విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని అందించాలని వారు డిమా ండ్ చేశారు. యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అసోసియేట్ ప్రొఫెసర్ నియమి ంచడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఇప్పటివ రకు రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేడని.. స్వయానా ముఖ్యమంత్రి ఆ బాధ్యత నిర్వర్తిస్తున్నప్పటికీ విద్యారంగ సమస్యలు పరిష్కా రం కావడం లేదన్నారు. విద్యారంగాన్ని విద్యార్థులను విస్మ రించిన గత ప్రభుత్వాలు అధికారాన్ని కోల్పోయాయని గుర్తు చేశారు. ఇప్పటికైనా రాష్ట్రంలో విద్యా ర్థుల సమస్యలను పరిష్కారం చేయాలని లేనిపక్షంలో గత ప్రభుత్వాలకు పట్టిన గతే ఈ ప్రభుత్వానికి కూడా పడు తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి. రాజేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు, అర్జున్, ఎస్ఎఫ్ఐ నాయకులు, రవి, కిరణ్,అనిల్ కుమార్, శేఖర్, రాజు, నవీన్, కుమార్, మేఘన నవ్యజ్యోతి, కావ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పంట రుణాలు వెంటనే ఇవ్వాలి

- సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి జయరాజు



నవతెలంగాణ-సంగారెడ్డి

రైతులకు పంట రుణాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న బ్యాంక్‌లపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని.. వెం టనే రైతులకు రుణాలిచ్చేలా చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. సంగారెడ్డి కేకే భవన్‌లో రైతుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో బ్యాంకర్ల సమావేశం జరుగుతున్నా.. రైతులకు రుణాలు అందటం లే దన్నారు. బిజినెస్ రుణాలు ఒక్క రోజులో ఇస్తున్న బ్యాం క్‌లు.. అన్నం పెడుతున్న రైతులకు మాత్రం నెలలు తరబడి తిప్పుకుంటున్నారన్నారు.రిజర్వ్ బ్యాంక్ నిబంధనలు పట్టిం చుకోవడం లేదని విమర్శించారు. రైతులు క్రాప్‌లోను రెన్యు వల్ చేసుకోవాలంటే మధ్య దళారులే అన్ని బ్యాంకుల్లో ఉండి రెన్యువల్ చేయిస్తున్నారన్నారు. డైరెక్ట్‌గా ఫీల్డ్ ఆఫీసర్ దగ్గ ంకు వెళ్తే రైతుకు పని కావటం లేదన్నారు. తక్షణమే సమస్య పరిస్కారం చేయకుంటే రైతులతో ఉద్యమాలు చేప డతా మని హెచ్చరించారు.కార్యక్రమంలోనాయకులుకే. రాజయ్య, శ్రీనివాస్, యాదవరెడ్డి,మైపాల్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేసిన వ్యక్తికి ఏడేండ్ల జైలుశిక్ష

- రూ.50వేల జరిమానా



నవతెలంగాణ-సంగారెడ్డి

పంట పొలంలో గంజాయి సాగు చేసిన ఓ వ్యక్తికి ఏడేం డ్ల జైలు శిక్షతోపాటు రూ.50వేల జరిమానాను విధిస్తూ సంగారెడ్డి జిల్లా అడిషనల్ జిల్లా సెషన్ జడ్జి కే. జయంతి గురువారం తీర్పు వెలువరించారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే..

సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం తంగాడపల్లి గ్రామానికి చెందిన నాగులపల్లి వీరన్న(42) 2020లో తన పంట పొలంలో 21 గంజాయి మొక్కలను సాగు చేశారు. ఈ సమాచారం అందుకున్న సంగారెడ్డి స్టేషన్ సీఐ మధు బాబు.. సదరు పొలాన్ని పరిశీలించి గంజా యి మొక్కలను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. 2020 నుంచి నడుస్తున్న ఈ కేసులో గురువారంతుది తీర్పును న్యాయమూర్తి వెలు వరించారు. గంజాయి సాగు నిందితుడికి శిక్ష పడడంతో నిం దితుడు నాగులపల్లి వీరన్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సిహెచ్ రాములు జైలుకు తరలించారు. వరుసగా నాలుగు కేసుల్లో శిక్షలు పడే విధంగా చర్యలు చేపట్టిన జె.మధు బాబు ఎక్సైజ్ సిఐని,ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ వివి కమల హసన్‌రెడ్డి డ ిప్యూటీ కమిషనర్లు హరికిషన్, కేఏబి శాస్త్రి అభినందించారు.

కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాలు



నవతెలంగాణ-జహీరాబాద్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను, కార్మికుల సమస్యలను కనీస వేతనాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు విమర్శించారు. స్థానిక శ్రామిక్ భవన్‌లో గురువారం జరిగిన సీఐటీయూ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడు తూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను పట్టించుకో కుం డా.. కనీస వేతనాలను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహి స్తున్నాయన్నారు. అంతేకాకుండా కొత్తగా లేబర్ కోడ్‌లు తేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా.. వేతనాలు పెంచ కుండా, కొత్త జీవోలను సవరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలపై కార్మికులు, సీఐటీయూ కార్యక ర్తలు ఉద్యమించాలన్నారు. తక్షణమే కనీస వేతనం సవరణ చేసి.. రూ. 26,000 ఉండే రకంగా నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్, మండలాల, రంగాల నాయకులు నరసయ్య గౌరమ్మ, నరేష్, జగదాంబ, ఆనంద్, సత్యన్నా, రెహానా తదితరులు పాల్గొన్నారు.

సింగూరు ఎడమ కాలువ నీరు వెంటనే వదలాలి

- ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.50వేల నష్టపరిహారం చెల్లించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్య దర్శివర్గ సభ్యులు జి.సాయిలు



నవతెలంగాణ-పుల్కల్

సింగూరు ఎడమ కాలువ నీరు వదలకపోవడంతో పుల్కల్ ముదిమాణిక్యం, ఇటిక్యాల, నాద్లపూర్, కోడాకల్ గ్రామాల్లో వరి పంట తీవ్రంగా దెబ్బతిన్నదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.సాయిలు అన్నారు. నష్టపో యిన పంటకు వెంటనే ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు దెబ్బతిన్న పంట లను గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కెనాల్ వదలక భూగర్భ జలాలు అడ గంటడంతో... బోర్లు మూతపడే పరిస్థితి వచ్చిందన్నారు. దాంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. అప్పులు చేసి పెట్టుబడి పెడితే.. నీరు లేక పంట ఎండిపోతున్నదని వాపోతున్నారు. కాబట్టి అధికారులు వెంటనే స్పందించి దెబ్బ తిన్న పంటను అంచనా వేసి పరిహారం చెల్లించాలన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ ఇన్చార్జి డి.విద్యాసాగర్, ఏరి యా కమిటీ సభ్యులు నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్‌గా హమాలీ కూతురు



నవతెలంగాణ-సదాశివపేట

మండల పరిధిలోని ఇశితబాద్ గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన తస్లీమ్ ఫాతిమా జువాలజీ సబ్జెక్టులో రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకు సాధించి జూనియర్ లెక్చరర్‌గా సెలెక్ట్ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె తండ్రి ఎస్కే బాబు మియా హర్షం వ్యక్తం చేశారు. కాహ ఆయన హమాలీ పన ులు చేస్తున్నా.. కూతురు చదువుకు పూర్తి సహకారం అందిం చారు. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న ఫాతిమా.. జూనియర్ లెక్చరర్‌గా సెలెక్ట్ అవ్వడం పట్ల ఆమె కుటుం బంతోపాటు గ్రామస్తులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్కే బాబుమియా మాట్లాడుతూ.. తన కూతురు జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్లో చదువుకున్నదని.. చిన్ననాటి నుంచే చదువులో ముందంజలో ఉండేదన్నారు. తాను కూడా హమాలీ కార్మికుడుగా పని చేస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో తెలంగాణ స్టేట్ సివిల్ సప్లై కార్పొరేషన్ హమాలీ వర్కర్స్ యూనియన్‌లో ప్రధాన కార్యదర్శిగా ఎదిగినట్టు గుర్తు చేసుకున్నారు.

ప్రశాంత వాతావరణంలో పండగలు జరపాలి



నవతెలంగాణ-జహీరాబాద్

పండగలు ప్రశాంత వాతావరణంలో జరపడానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం అన్ని మతాల, రాజకీయ నాయకులతో గురువారం పీస్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డీస్పీ మాట్లాడుతూ.. జహీరాబాద్ పట్టణంలో అన్ని మతాల, కులాల వారు కలిసిమెలిసి ఐక్యంగా పండగలు జరుపు తారని.. ఆ సాంప్రదాయాన్ని అలాగే కొనసాగించేలా అందరూ సహకరించాలన్నారు. నేడు ఒకేరోజు హెూలీతో పాటు రంజాన్ పండగలకు సంబంధించిన ప్రత్యేక ప్రార్థనలు ఉన్నందున అందరూ కలిసిమెలిసి పండగలు చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు మంకల్ సుభాష్ గుప్తా, అల్లాడి నర్సింలు, సీఐ శివలింగం, ఎస్ఐ కాశీనాథ్, పట్టణ పుర ప్రముఖులు పాల్గొన్నారు. కాగా పీస్ కటింగ్ సమావేశానికి పట్టణ పుర ప్రముఖులందరిని కాకుండా ఒక పార్టీకి మాత్రమే పోలీసులు ప్రాధాన్యత ఇస్తున్నారని పలు పార్టీల నాయకులు విమర్శించారు.

ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించిన ఉజ్వల్‌రెడ్డి



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో గల డయాలసిస్ సెంటర్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సిద్దం ఉజ్వల్‌రెడ్డి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్‌తో కలిసి గురువారం పరిశీలించారు. కాగా పేషెంట్స్‌కీ మరిన్ని పడకలు కావాలని సూపరింటెండెంట్ కోరారు. దానికి ఉజ్వల్‌రెడ్డి స్పందించి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కృషితో ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కాగా అల్లీపూర్ గ్రామ మాజీ సర్పంచ్ పెంటారెడ్డి ఇటీవలే మృతి చెందిన విషయం తెలిసి.. అతడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.నర్సింహారెడ్డి, సీడీసీ చైర్మెన్ మహ్మద్ అబ్దుల్ ముబీన్, మాజీ కౌన్సిలర్లు శేఖర్ సీనియర్ నాయకులు సుభాష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అరుణ్ కుమార్,కె.జగదీశ్వర్ రెడ్డి,నర్సింహా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హెూళీ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్



నవతెలంగాణ-సంగారెడ్డి

హెూళీ పండుగను పురస్కరించుకుని జిల్లా ప్రజలకు కలెక్టర్ క్రాంతి వల్లూరు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ ఆనందం కలిగేలా, శాంతి, సామరస్యంతో హెూళీ వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. హెూళీ అనేది ప్రేమ, స్నేహానికి, భిన్నత్వంలో ఐక్యతకు ప్రతీక అన్నారు. రసాయనిక పదార్థాలు కలిగిన రంగుల బదులుగా సహజమైన, ఆరోగ్యానికి హాని కలిగించని రంగులను ఉపయోగించుకోవాలని సూచించారు. ఎక్కువగా నీటిని వృథా చేయకుండా హెూళీ జరుపుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నేడు(శుక్రవారం) డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డీఎం మల్లేశయ్య తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రయాణికులు 9063417161 కు ఫోన్ చేసి సమస్యలు వివరించాలన్నారు.

పండుగలు ప్రశాంత వాతావరణంలో జరపాలి



నవతెలంగాణ-న్యాల్‌కల్

హద్నూర్ పోలీస్‌స్టేషన్‌లో శాంతికమిటీ సమావేశాన్ని జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు, ఎస్ఐ చల్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మత పెద్దలకు, ప్రజాప్రతిని ధుల కు పలు సూచనలు చేశారు. హెూలీ, ఉగాది, రంజాన్ పండుగలు కుల మతాల అతీతంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఈ సమా వేశంలో ఝరాసంఘం ఎస్సై నరేష్, నారాయణ, ఆయా గ్రామాల నాయకులు ప్రజలు రాజ్‌కుమార్,రాజేష్, అశ్విన్, మును పటేల్, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

కవయిత్రి కుమ్మర మొల్ల జయంతి



నవతెలంగాణ-సదాశివపేట

మండలంలోని కోనాపూర్ గ్రామంలో కవయిత్రి కుమ్మర మొల్ల జయంతి వేడుకను గురువారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా కోనాపూర్ బక్కప్ప మాట్లాడుతూ.. 16వ శతాబ్దానికి చెందిన తెలుగు కవయిత్రి మొల్ల రచించిన రామాయణం.. తెలుగు సాహిత్యంలో ఒక గొప్ప రచన అన్నారు. ఆమె తన రచనల ద్వారా సాంఘిక అసమా నతలను ప్రశ్నించిందన్నారు. 2017లో భారత ప్రభుత్వం మొల్ల జ్ఞాపకార్థం తపాలా బిళ్ళను విడుదల చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కుమ్మరి కృష్ణ, అంజయ్య, సంగయ్య, విట్టల్, నర్సిములు, సంగమేష్,ప్రవీణ్ కుమార్,శివకుమార్, శ్రీకాంత్, శివకుమార్,గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అన్యువల్ డే



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్ అధ్యక్షతన కళాశాలలో చదువుతున్న ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులకు వార్షిక దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా జోగిపేట సబ్ ఇన్‌స్పెక్టర్ పి.పాండు హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు తప్పు దోవ పట్టకుండా ఉన్నత చదువులు చదువుకోవాలని, ఉన్నత స్థానాల్లో ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని అధ్యాపక, అధ్యాపకేతర, విద్యార్థులు పాల్గొన్నారు.

జోగిపేటలో ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జోగిపేట


తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కవిత జన్మదినం సందర్భంగా గురువారం జోగిపేట పట్టణంలో కేక్ కట్ చేసి, వేడు కలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ డి బి నాగభూషణం, పట్టణ అధ్యక్షులు సార శ్రీధర్, బిఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం బిర్ల.శంకర్, మహేష్ యాదవ్, ఉస నాగరాజు, నాయి కోటి అశోక్, దాసరి దుర్గేశ్, కరుణాకర్, పరిపూర్ణం, దిలీప్ జైన్, శంకర్ రావు, రఫిక్, బలరాం, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా సభ్యత్వ నమోదు చేపట్టాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

నాయి బ్రాహ్మణ సేవా సంఘం సంగారెడ్డి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో విస్తృతంగా సభ్యత్వ నమోదు చేపట్టాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సంగారెడ్డి పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీశైలం నాయి పిలుపునిచ్చారు. గురువారం పట్టణ అధ్యక్షులు లకడారం మాణిక్ ప్రభు ఆదేశాల మేరకు కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ సాయినాథ్ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని షాప్ టు షాప్ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాయి బ్రాహ్మణ సేవా సంఘం పట్టణ కమిటీ గౌరవ అధ్యక్షులు దత్తాత్రేయ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపా ధ్యక్షులు పెంటయ్య, సహాయ కార్యదర్శి రజోల్ ప్రభు, కార్యదర్శి మురారి, కోశాధికారులు శేఖర్, స్వాగత్ ప్రభు, యువత అధ్యక్షులు చరణ్, ప్రధాన కార్యదర్శి రాము,అనిల్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలి



నవతెలంగాణ-మునిపల్లి

ఇటీవలే గెలుపొందిన పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డిని ఆయన స్వగృహంలో బీజేపీ మునిపల్లి మండల కమిటీ సభ్యులు మండలాధ్యక్షుడు ఉపేందర్ ఆధ్వర్యంలో గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లా డుతూ.. తన గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలకు, ఓటు వేసి గెలిపించిన పట్టభద్రులకు కృతజ్ఞతలు తెలిపారు

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేత



నవతెలంగాణ-సదాశివపేట

మండలంలోని ఆరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మన సమాజం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జంగం మహేష్ స్వామి మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో 10వ తరగతి కీలకమన్నారు. కాబట్టి అత్యధిక మార్కులతో విజయం సాధించాలన్నారు. నిజ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. సమాజంలో ఉన్న వారంద రూ విద్యార్థులను ఇలా ప్రోత్సహించడం మంచి మార్గంలో పోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మన సమాజం ఫౌండేషన్ జాయింట్ సెక్రెటరీ రవికుమార్ గౌడ్, మన సమాజం ఫౌండేషన్ నిర్వాహ కులు మడివాలయ స్వామి, విజయ్ స్వామి, నాగభూషణం, యాదగిరి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అవధూత గిరి మహారాజ్ పాదయాత్ర

నవతెలంగాణ-న్యాల్‌కల్

బర్దిపూర్ అవధూత గిరి మహారాజ్ ఆధ్వర్యంలో బేల్లాపూర్ గ్రామం నుంచి ప్రారంభమైన పాదయాత్ర పల్లకి సేవ గురువారం రాహికోడ్ చౌరస్తా మీదుగా శంశోద్దీన్ పూర్, మిర్జాపూర్ (ఎన్), ముంగి, రుక్మాపూర్, హద్నూర్ గ్రామాల్లో సాగింది. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు భాస్కర్ రెడ్డి, విట్టల్ రెడ్డి, రాజ్ కుమార్, బక్కయ్య స్వామి, మహిళలు పలు గ్రామస్తులు పాల్గొన్నారు.

మండుటెండల్లో మాడిపోతున్నాం..



గొడుకు సాయంతో ఎండ నుంచి రక్షణ

- కంకోల్ సంతలో ఎన్నో సమస్యలు..
- ఎద్దుకి రూ.100 నుంచి 200, మేకకు రూ.50నుంచి 60 వసూలు..
- అయినా వసతులు కల్పించని నిర్వాహకులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం
- వ్యాపారులు, ప్రజల ఆవేదన

నవతెలంగాణ-మునిపల్లి

సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని కంకోల్ గ్రామంలో పెద్ద ఎత్తున సంత జరుగుతుంది. ఇందులో కూరగాయలు మాత్రమే కాకుండా పశువుల క్రయవిక్ర యాలు కూడా జరుగుతుంటాయి. చుట్టూ పక్కల గ్రామాల్లో నిర్వహించే సంతల్లో ఇదే అతి పెద్దది. దాంతో ఈ సంతకు పెద్ద ఎత్తున వ్యాపారస్తులు, ప్రజలు వస్తుంటారు. వారానికి లక్షల్లోనే ఈ సంత ద్వారా క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. అయినప్పటికీ సంతలో సరైన సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం భానుడి భగభగలు భయపెడు తున్న నేపథ్యంలో.. ఈ సంతలో కనీసం నీడ సౌకర్యం లేకపోవడంతో అటు వ్యాపారస్తులు, ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండలో మాడిపోతున్నామంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంకోల్ గ్రామంలో ప్రతీ గురువారం సంత జరుగుతుంది. ఈ సంతకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలే కాకుండా.. కర్ణాటక నుంచి సైతం వస్తుంటారు. ఈ సంతలో కూరగాయలతోపాటు.. మేకల బజార్, ఎడ్ల బజార్‌లో భారీ ఎత్తున క్రయవిక్రయిలు జరుగుతుంటా యి. కేవలం ఒక వారానికే లక్షల్లో ఆదాయం జరుగుతుంది. అయిన ప్పటికీ సంతలో మాత్రం కనీస సౌకర్యాలు లేవని వ్యాపారస్తులు, ప్రజలు చెబుతున్నారు. తాగడానికి మంచినీటి సౌకర్యం లేదని.. మరుగుదొడ్లు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా నిలువ నీడ కూడా లేదని.. దాంతో ఎండలో మాడుపోతున్నామని వాపోతున్నారు. కనీసం కూర్చుని వ్యాపారం చేసుకోవడానికి కూడా వీలు లేదని.. దిమ్మలు కూడా లేని పరిస్థితి ఉన్నదన్నారు. మట్టిలోనే కూర్చొని మట్టిలోనే కూరగాయలు పెట్టుకొని విక్రయించుకోవాల్సిన దుస్థితి నెలకొన్నదని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క నిర్వాహణ కోసం తమ వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నప్పటికీ సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదని మండిపడుతున్నారు.

కూరగాయల దుకాణాల నుంచి కూడా వసూళ్లు..

మరోపక్క, కూరగాయల దుకాణాల వద్ద నుంచి కూడా ఒక్కో దుకాణానికి రూ.30 నుంచి 40 నిర్వాహణ పేరిట డబ్బులు తీసుకుంటున్నారన్నారు. దానికి మార్కెట్ రసీదు కూడా ఇవ్వడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. అలాగే ఒక మేకకు రూ.50, ఒక ఎద్దుకి రూ.100 నుండి 200 వరకు వసూలు చేస్తున్నారన్నారు. అయినప్పటికీ మార్కెట్‌లో వసతులు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వ్యాపా రస్తులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క సోమవారం జరిగే బుదేరా మార్కెట్లో, బుధవారం జరిగే ఖవ్వంపల్లి, మునిపల్లి చౌరస్తాలో జరిగే మార్కె ట్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. ఆదా యం ఉన్నా వసతులు కరువు అన్నట్టుగా పరిస్థితులు ఉన్నా యి. ఉదయం నుండి సాయంత్రం వరకు కూరగాయలు అమ్ముకునే వారికి మంచినీటి సౌకర్యం, మూత్ర విసర్జన చేయడానికి వసతులు లేక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారుల స్పందించి మార్కెట్ నిర్వాహకులపై చర్యలు తీసుకొని కావాల్సిన వసతులు ఏర్పాటు చేసే విధంగా చూడాలని వ్యాపారస్తులు, ప్రజలు కోరుతున్నారు.

సహజ సిద్ధమైన రంగులతో హోలీ జరపాలి

- లోతట్టు ప్రదేశాల్లో, చెరువుల్లో ప్రాజెక్టుల్లో స్నానాలు చేయునప్పుడు జాగ్రత్తలు పాటించాలి
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



నవతెలంగాణ-సంగారెడ్డి

హెూలీ పండుగను సంప్రదాయ పద్ధతుల్లో సహజ సిద్ధమైన రంగులతో జరుపుకోవాలని, లోతట్టు ప్రదేశాల్లో, చెరువుల్లో ప్రాజెక్టులలో స్నానాలు చేయునప్పుడు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చర్మానికి, పర్యావరణానికి హాని కలిగించని న్యాచురల్ కలర్స్‌ను వినియోగించి, ప్రశాంత వాతావరణంలో, ఆనందోత్సాహాలతో హోలీ జరుపుకోవాలన్నారు. ముఖ్యంగా యువత మద్యం సేవించి వాహనాలను నడపడం, బహిరంగ ప్రదేశాలపై, ఇష్టం లేని వ్యక్తులపై, వాహనాలపై రంగులు, రంగు నీళ్ల చల్లకూడం వంటవి చేయొద్దన్నారు. బైకులపై, కార్లల్లో గుంపులుగా తిరిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే అట్టి వ్యక్తులపై చట్టరీత్య చర్యలు తప్పవని హెచ్చరించారు. హెూలీ పండుగ అనంతరం చెరువుల్లో లోతట్టు ప్రాంతాల్లో స్నానాలు ఆచరించే క్రమంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల కార్యకలాపాలను తరుచూ గమనిస్తూ వారికి సరైన మార్గాలను నిర్దేశించాలన్నారు. హెూలీ పండగ సందర్భంగా ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లను చేసినట్లు వివరిం చారు. అత్యవసర పరిస్థితిలో 100కి డయల్ చేయాలని సూచించారు. ఈ హెూలీ మీ జీవితాల్లో రంగులు నింపాలని కోరుకుంటూ సిబ్బందికి, సంగారెడ్డి జిల్లా ప్రజలకు హెూలీ పండగ శుభాకాంశాలు తెలిపారు.

కవితకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మఠం బిక్షపతి



నవతెలంగాణ-జోగిపేట

తెలంగాణ జాగృతి అధినేత, కేసీఆర్ తనయ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కవిత జన్మదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి బంజారాహిల్స్‌లోని ఆమె నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మఠం బిక్షపతి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని కొనియాడారు. తెలంగాణ ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలుస్తూ బతుకమ్మకు అంతర్జాతీయ ఖ్యాతిని కల్పించిన ఘనత కవితకు దక్కిందన్నారు. అమలు కానీ హామీలు ఇచ్చి ప్రజల్ని వంచించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నారన్నారు. ముఖ్యంగా బీసీ, మహి ళలకు లకు రాజకీయంగా అవకాశాలు కల్పించాలని గలమెత్తి ఉద్యమాన్ని నిర్మిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో బీసీలకు, మహిళ లకు న్యాయం జరిగేలా ఉద్యమాన్ని ఉవ్వెత్తున ముందుకు తీసు కుని వెళ్లి అనుకున్న లక్ష్యాన్ని చేరు కుంటామని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ జాగృతి కన్వీనర్ నరేందర్ యాదవ్, జాగృతి నాయకులు రోహిత్ రావు, రోహిత్‌రెడ్డి, బొల్లంపల్లి సందీప్, నాయికోటి నవీన్, ఉమ్మడి మెదక్ జిల్లా తెలంగాణ జాగృతి కన్వీనర్ మల్లేష్, నాయకులు శ్రీశైలం, పీటర్, భరత్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి 'ఐట' కృషి అభినందనీయం



నవతెలంగాణ-జహీరాబాద్

మతసామరస్యానికి 'ఐట' ఉపాధ్యాయ సంఘం చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని ఎంఈఓ బసవరాజ్ అన్నారు. గురువారం స్థానిక ఇస్లామిక్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతీయేడు అట వారు వివిధ ఉపాధ్యాయ సంఘాలతో పాటు విద్యావేత్తలకు ఇఫ్తార్ విందును నిర్వహించడం అభినంద నీయమన్నారు. పీఆర్‌టయూ జిల్లా అధ్యక్షులు తులసి రామ్ రాథోడ్ మాట్లాడుతూ.. భిన్నత్వంలో ఏకత్వం మహమ్మద్ ప్రవక్త చాటాడన్నారు. ఈ కార్యక్రమంలో ఐటా రాష్ట్ర అధ్యక్షులు మీర్ ముంతాజ్ అలీ, వివిధ సంఘాల నాయకులు అబ్దుల్ ముజీబ్, నజీముద్దీన్, నిజాముద్దీన్ ,సయ్యద్ సిరాజ్, సయ్యద్ రఫ్, మహమ్మద్ సిరాజ్, జగదీశ్వరయ్య, శంకరయ్య, నాను సింగ్ రాథోడ్, మూర్తి, మైనోద్దీన్, కూడా రామచంద్ర భీం వంశీ, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం





నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని మెటల్‌కుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలనా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. డీఈఓగా అంకిత, ఎంఈఓగా లక్ష్మి ప్రియ, హెచ్ఎంగా సాయికుమార్, ఉపాధ్యాయ లుగా నరేష్ వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనం తరం పాఠశాల హెచ్ఎం అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నేటి విద్యార్థులను రేపటి భావి పౌరులుగా తీర్చి దిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాశీనాథ్ స్వామి, నవిత, మధుసూదన్, చైతన్య, విద్యార్థులు ఉన్నారు.

నారాయణఖేడ్‌రూరల్ : మండలంలోని పైడిపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలనా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి స్వయంపాలన పాఠాలు బోధించినట్టు ప్రధానోపాధ్యాయులు శాంతిబాయి తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా షిఫా, కలెక్టర్‌గా సర్వారాజ్, జిల్లా విద్యాధికారిగా తౌసిఫ్, మండల విద్యాధికారిగా శివానంద్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గా రమేష్, ఉపాధ్యాయులుగా స్వప్న, అక్షిత, వీరమని, ఉస్మ, స్వాతిక, మేఘన, హుమేరా, మహావీన్, అనూష, శృతి,అయ్యన్, కిరణ్ , అరుణ్, రాజేష్, అరవెన్, సుశాంత్‌లు వ్యవహరించారు.పాఠశాల ఉపాధ్యాయులు అశోక్, లక్ష్మణ్ పలువురు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ యజమానిపై, సిబ్బందిపై దాడి



నవతెలంగాణ-వట్‌పల్లి

పెట్రోల్ విషయమై ఘర్షణ జరగ్గా.. బంక్ యజమానిపై, ఓ కార్మికుడిపై కొందరు దాడికి పాల్పడిన ఘటన మండల పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతులబొగుడ గ్రామానికి చెందిన మాడే శివసాయి బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో స్థానికంగా గల ఇండియన్ ఆయిల్ తుల్జా భవాని పెట్రోల్ బంక్‌కు వచ్చాడు. పెట్రోల్ పోయాలని అడగ్గా.. ట్యాంకర్ ఖాళీ అవుతున్నదని కొంచెం సేపు వేచి ఉండాలని బంక్ యజమాని సద్దాం, మరో కార్మికుడు శివరావు చెప్పారు. ఈ క్రమంలో వారి మధ్య ఘర్షణ జరిగింది. ఈ విషయాన్ని మనుస్సులో పెట్టుకున్న శివసాయి గురువారం ఉదయం సందీప్, మహేష్, శేఖర్‌తో కలిసి బంక్ యజమానితో పాటు కార్మికుడు శివరావుపై మూకుమ్మడి దాడి చేసి గాయపర్చారు.ఈ మేరకు వారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు.

ఆస్తి పన్ను పెనాల్టీపై 90శాతం రాయితీ కల్పించాలి

అసిస్టెంట్ కలెక్టర్, ఆర్డీవోకు బీఆర్ఎస్ నాయకుల వినతి



నవతెలంగాణ-జహీరాబాద్

జీహెచ్ఎంసీల మాదిరిగానే మున్సిపాల్టీలకు కూడా ఆస్తిపన్ను పెనాల్టీపై 90శాతం రాయితీ కల్పించాలని మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకులు నామ రవి కిరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయంలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైని)మనోజ్, మున్సిపాల్టీ ప్రత్యేక అధికారి ఆర్డిఓ రామ్‌రెడ్డికి గురువారం వినతి పత్రం అందజేశారు. సందర్భంగా రవి కిరణ్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని పేద, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని జీహెచ్ఎంసీ మాదిరిగానే ఆస్తి పన్ను పెనాల్టీపై 90శాతం రాయితీని కల్పించాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రజల సౌకర్యార్థం 90 శాతం రాయితీ పథకాన్ని రాష్ట్రంలోని అన్ని మున్సిపా ల్టీల్లో అవకాశం కల్పించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ యాకుబ్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బండి మోహన్, మాజీ కౌన్సిలర్ అబ్దుల్లా, నాయకులు ప్రభు యాదవ్, శివప్ప, ఆశం, రాకేష్, సాజిద్, అలీ, నరేష్ రెడ్డి , సికందర్ తదితరులు పాల్గొన్నారు.

బాలలను హింసించొద్దు..



నవతెలంగాణ-సంగారెడ్డి

బాలలను హింసించొద్దని.. వారి హక్కులను కాపాడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాలతో సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సౌజన్యంతో సంగారెడ్డి కోర్ట్ ఆవరణలో జువైనల్ జస్టిస్ చట్టం, పోక్సో చట్టలపైనా గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జి. భవాని చంద్ర మాట్లాడుతూ.. బాలలను హింసించొద్దని వారి హక్కులను కాపాడాలన్నారు. వారిని కార్మికులు మార్చొద్దన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని.. వారి సంక్షేమం కోసం అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మొదటి అదనపు జిల్లా జడ్జి కే.జయంతి మా ట్లాడుతూ.. పోక్సో చట్టలపైనా పూర్తి అవహగాహన కల్పిస్తూ ఇటువంటి శిక్షణ కార్యక్రవ ాలను వినియోగించుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ జిల్లా మూడో అదనపు సెషన్స్ జడ్జి సంగారెడ్డి జి.సునీత రవీంద్ర రెడ్డి,రెండోఅదనపు జిల్లా, సెషన్స్ జడ్జి, సంగారెడ్డి డా.పి.పి.కృష్ణార్జున్,ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి సంగారెడ్డి రాధాకృష్ణ చౌహన్,జిల్లా ప్రధాన న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, సంగారెడ్డి ఆర్. అనిత, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సంగారెడ్డి పారితోష్ పంకజ్,జిల్లా సంక్షేమ అధికారి సంగారెడ్డి లలిత కుమారి, సంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, కోర్ట్ సిబ్బంది, అడ్వకేట్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ రంగాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్రం కుట్ర



నవతెలంగాణ-సంగారెడ్డి

కేంద్ర ప్రభుత్వం అంగన్వాడీ రంగాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తోందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ పిడి లలిత కుమార్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడు తూ.. రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు ఇచ్చిన హామీలకు భిన్నంగా వ్యవహరిస్తున్నదన్నారు. ఐసిడిఎస్‌కు వ్యతిరేకంగా అత్యంత దుర్మార్గంగా కేంద్రం చేసిన నిర్ణయాలను రాష్ట్రంలో అమలు చేయా లని చూడటం చాలా అన్యాయమన్నారు. ఈ చర్యలు రాష్ట్రంలో ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేస్తాయన్నారు. పేద ప్రజలకు, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ తీవ్రమైన నష్టం కల్గిస్తాయన్నారు. ఐసిడిఎస్ వ్యతిరేక విధానాల అవలు రాష్ట్రంలో వెంటనే ఆపాలని, ఎస్ఇపి చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు గత, ప్రస్తుత ప్రభుత్వాల హామీలు, కోర్టు తీర్పులు గ్రాట్యుటీ పర్మినెంట్ అమలు చేయాలని కోరుతూ ఈనెల 17, 18 తేదీల్లో జిల్లా కేంద్రంలో 48 గంటల ధర్నా వంటావార్పును పెద్దఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి. మంగ, ఎం. శశికళ, నాయకులు ఎం.ఏసుమని తదితరులు పాల్గొన్నారు.

విద్యా పరిజ్ఞానం ఉంటే ఏ రంగంలోనైనా రాణిస్తారు



నవతెలంగాణ-జహీరాబాద్

చిన్నతనం నుంచే విద్యా పరిజ్ఞానం కలిగి ఉంటే వారు ఏ రంగంలోనైనా రాణిస్తారని సీఐ శివలింగం అన్నారు. శకాపూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన విద్యార్థుల మోటేవేషన్ తరగతుల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ఉపాధ్యాయులే జీవిత రోల్ మోడల్ అని.. వారి సూచనలు పాటిస్తే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారన్నారు. అమ్మాయిల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలకు తప్పవన్నారు. విద్యార్థిణులు కూడా భయపడొద్దని.. తమ పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే తక్షణమే ఉపాధ్యాయులకు, తల్లితండ్రులకు తెలియజేయాలన్నారు. ప్రతీ పాఠశాలలో పోలీసుల నిఘా ఉంటుందని ధైర్యం చెప్పారు. అనంతరం గ్రామ ప్రత్యేక అధికారి, జహీరాబాద్ మండల తహసీల్దార్ రవీందర్ ఫోన్ ద్వారా పదో తరగతి విద్యార్థులకు శుభాభివందనలు తెలిపారు.తాజా మాజీ సర్పంచ్ గడ్డమీది చిన్నారెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం ప్రధాన ఉపాధ్యాయులు సంగయ్య అధ్యక్షతన, ఉపాధ్యాయులు రమేష్ రాథోడ్ పర్యవేక్షణలో సాగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, మొహమ్మద్ రియజుద్దీన్, మొహమ్మద్ అబ్దుల్ ఖుద్దుస్, బిచ్చయ్య,సీఆర్పీ శేఖర్, పాఠశాల అధ్యక్షురాలు సుజాత, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

రేజింతల్ పాఠశాలలో నో బ్యాగ్ డే



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని రేజింతల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం సఫియా సుల్తానా ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం నో బ్యాగ్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అకాడమీ మానిటరింగ్ ఆఫీసర్ అనురాధ, కమ్యూనిటీ మొబైలైజేషన్ ఆఫీసర్ వెంకటేశం మండల విద్యాధికారి మారుతి రాథోడ్, పాఠశాల చైర్మెన్ రామేశ్వరి, మాజీ ఎంపీటీసీ నల్లవల్లి మల్లిక శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన వంద రకాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు రకరకాల వేషధారణతో, సాంస్కృతిక ఆటాపాటలతో విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. పాఠశాలలను మరింత మెరుగుదిద్దుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అనంతరం హెచ్ఎంను పలువురు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ సిద్ధారెడ్డి, డీసీడీఓ సుప్రియ, పాఠశాల చైర్మెన్ రామేశ్వరి, మాజీ ఎంపీటీసీ మల్లిక శ్రీనివాస్ రెడ్డి, గ్రామస్తులు తిరుపతి రెడ్డి, విష్ణు, సంజీవ్, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు కాంప్లెక్స్ హెచ్ఎంలు విద్యార్థులు ఉన్నారు.

ప్రభుత్వ నిర్ణయం ప్రకారమే పనులు చేపట్టాలి



నవతెలంగాణ-టేక్మాల్

ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారమే ఉపాధి హామీ పనులు చేపట్టాలని ఏపీవో పోలు అన్నారు. గురువారం టేక్మాల్ పరిధిలోని పంతులు చెరువులో ఉపాధి హామీ పనులను ప్రారంభించిన అనంతరం ఆయన కూలీలనుద్దేశించి మాట్లాడారు. ఉపాధిహామీలో చేస్తున్న పనులను ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారమే పనులు చేయాలని సూచించారు. ఉదయం పూటనే పనులు నిర్వహించాలని కోరారు. మధ్యాహ్నం ఎండ తీవ్రతగా ఉన్నందువలన ఎవరు ఇబ్బంది పడకూడదు అన్నారు. కూలీల సంఖ్య పెంచడం కోసం ఫిల్టర్ మెట్లు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ప్రతికూలికి 100 రోజుల కూలి కల్పించబడుతుందన్నారు. జాబ్‌కార్డు లేని వాళ్ళు కార్యాలయంకు వచ్చి అర్జీలు పెట్టుకుంటే పరిశీలించి జాబ్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. కూలీలు గిట్టుబాటు అయ్యేలాగా పనులు చేయాలని సూచించారు. వసతులు లేకుంటే తమ దృష్టికి తీసుకువస్తే వసతులు కల్పిస్తామని చెప్పారు. ఈయన వెంట క్షేత్ర సహాయకులు రాములు సీనియర్ మేటిలు ఉన్నారు.

వరిలో నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలి



నవతెలంగాణ-నిజాంపేట

మండలంలో ప్రస్తుతము రైతులు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంగా మండలం వ్యవసాయ అధికారి లింగా రెడ్డి మాట్లాడుతూ భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో వారి మడ్లలో నీరు లేక నెలలు నెర్రెలు బారుచున్నాయన్నారు. బోరు బావులలోని నీటిని పైపుల ద్వారా కానీ కాలువల ద్వారా కానీ వరిమడ్లలో మోతాదు వరకే నీటిని పారపెట్టాలి.

పాఠశాలల భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

- అందోల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ జగన్మోహన్ రెడ్డి



నవతెలంగాణ-టేక్మాల్

ప్రభుత్వ పాఠశాలలో భద్రత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అందోల్ మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని గొడుమెట్పల్లి ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం కోసం భూమి పూజ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాఠశాలలకు చదువులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్రహరీ గోడను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రహరీ గోడ నిర్మాణం కోసం దామోదర్ రాజనర్సింహ తన ప్రత్యేక నిధుల నుంచి రూ.25 లక్షల నిధులు మంజూరు చేసి ప్రహరీ గోడ నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రహరీ గోడకు మంత్రి దామోదర రాజనర్సింహ నిధులు మంజూరు చేసినందుకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్ మాజీ జెడ్పిటిసి సభ్యురాలు సర్వని సరోజ, మండల వైస్ ప్రెసిడెంట్. సాగర్, రవిశంకర్, విట్టల్, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

ఘనంగా హోలీ సంబరాలు



నవతెలంగాణ-వెల్దుర్తి

మండల కేంద్రంలో బుధవారం రాత్రి గ్రామం మధ్యలో కామ దహనం వేద పండితుల మధ్య రాత్రి 12:30 గంటల ప్రాంతంలో డప్పుసప్పుల మధ్య కాముని దహనం గావించారు. మండల కేంద్రంలో మధిర గ్రామాల్లో చేరిలా, వెలకపల్లి, ఆరెగూడెం, చర్లపల్లి, పలు గ్రామాల్లో గురువారం హోలీ సంబరాలు నిర్వహించుకున్నారు. పెద్దలు సైతం చిన్న పిల్లల్లాగా రంగుల కేలి ఆటలాడి కులమత బేధాలకతీతంగా ఒకరిపై ఒకరు ఆప్యాయతంగా పలకరింపుతో వివిధ రకాల రంగులతో హోలీ ఆట ఆడారు. అనంతరం గాంధీ చౌరస్తా వద్ద పురాతన కాలంనాటి ఆనవాయితీ ప్రకారం రాక్షసులకు దేవుళ్లకు జరిగిన వాసకి అనే పామును తాడుగా చేసి బలాబలాలు చూపెట్టుకున్న సంఘటనను కండ్ల కట్టినట్టుగా కులమతాలకు అతీతంగా నిర్వహించారు. డప్పులతో గ్రామ నడిబొడ్డున మారు మోగింది. చిన్న పెద్ద తేడా లేకుండా గ్రామ నడి బొడ్డులో చేరి కేరింతలు కోలాటలు వంటి వినూత్న కార్యక్రమాలను నిర్వహించి అలాయి బలై కార్యక్రమాలు చేపట్టారు. చూపర్లకు ఎంతగానో ఆకట్టుకుంది. ప్రతి ఏటా నిర్వహించుకునే ఆనవాయితీ ప్రకారంగా సజావుగా నిర్వహించారు.

17న తైబజార్ వేలం పాట

నవతెలంగాణ-పాపన్నపేట

మండల కేంద్రమైన పాపన్నపేటలో ఈ నెల 17 తైబజార్, గింజల బజార్ టెండర్ సంబంధించి వేలం పాటలు నిర్వహిస్తామని పంచాయతీ సెక్రెటరీ నయీం తెలిపారు. డీఎల్పీఓ, గ్రామ ప్రత్యేక అధికారి సురేష్ బాబు అధ్వర్యంలో వేలం పాటలు జరుగుతాయని చెప్పారు. ఉదయం 10 గంటలకు స్థానిక పంచాయతి కార్యాలయంలో జరిగే, కార్యక్రమానికి ఆసక్తి గల టెండర్ దారులు హాజరు కావాలని కోరారు.

పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి నవీన్ గుప్త విరాళం



నవతెలంగాణ-శివ్వంపేట

మండలంలోని పెద్దగొట్టిముక్కుల గ్రామంలో గ్రామస్తుల సహాయం, దాతల సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారం తప్పకుండా అందిస్తానని మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్త అన్నారు. గురువారం ఆలయ కమిటీ నిర్వాహకులకు రూ.51 వేల విరాళాన్ని అందించనున్నట్లు ఆయన హామీ ఇవ్వగా శాలువాలతో ఘనంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా నవీన్ గుప్త మాట్లాడుతూ గ్రామాలలో ఆధ్యాత్మిక వైపు పయనిస్తూ నూతనంగా ఆలయాలను నిర్మించడం గొప్పదన్నారు. ఆలయాలు, దేవతల ఉత్సవాలకు తన వంతు సహకారం అందిస్తున్న నవీన్ గుప్త అడిగిన వెంటనే కాదనకుండా పెద్దమ్మ ఆలయానికి విరాళం అందించడం పట్ల ముదిరాజ్ సంఘం సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

మొల్లమాంబ 585వ జయంతి వేడుకలు



నవతెలంగాణ-సిద్ధిపేట

మొల్లమాంబ 585వ జయంతి సందర్భంగా పట్టణంలో శాలివాహన ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొల్ల విగ్రహానికి పూలమాలలు వేసి సభ్యులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాదారి నాగరాజు, శాలివాహన ప్రొఫెషనల్స్ ఆఫీసియల్స్ అసోసియేషన్ అధ్యక్షులు, అడ్వకేట్ వరుకోలు రాజలింగం, జిల్లా కుమ్మరి సంఘం అసోసియేట్ అధ్యక్షులు రాంచంద్రం, గర్నేపల్లి ఆంజనేయులు, ధరిపల్లి నగేష్, దరిపల్లి రాంచంద్రం, దరిపల్లి వెంకట్, తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ- దౌల్తాబాద్ : పూర్వ కాలంలో మహిళలలో అభ్యుదయ భావాలు కల్గించిన తొలి తెలుగు కవయిత్రి కుమ్మరి శాలివాహన ఆడపడుచు మొల్లమాంబ అని కుమ్మరి శాలివాహన మండల నాయకులు కుమ్మరి నర్సింలు అన్నారు. గురువారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో కవయిత్రి మొల్లమాంబ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామయణాన్ని తొలిసారిగా తెలుగులో రచించిన మొల్లమాంబ 15 వ శతాబ్దానికి చెందిన మహెూన్నత వ్యక్తి అన్నారు. ఆ కాలంలో స్త్రీ కవిత్వంపై, సూద్ర కవిత్వంపై పూర్తిగా నిషేదం ఉన్న సరస్వతీ తనయులుగా ఉన్న స్త్రీలు సాహిత్యంలో ఏ మాత్రం తక్కువ కాదని, ప్రకృతిని ఆరాధించి, సమాజాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరు సాహిత్య ప్రియులేనన్న సత్యాన్ని అక్షర రూపం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన సంఘం నాయకులు నర్సింలు, కనకరాములు, స్వామి, మల్లికార్జున్, రాజు, బిక్షపతి, స్వామి, రామస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ యూనివర్సిటీని చల్మెడ శివారులో కట్టించాలి

- 25 ఎకరాల భూమి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం
- ఆలయ కమిటీ

నవతెలంగాణ-నిజాంపేట

మెదక్ నియోజకవర్గంకు స్కిల్ యూనివర్సిటీ మంజూరైనట్లు విశ్వసనీయ సమాచారం. మండల పరిధిలోని చల్మెడ గ్రామ తిరుమల స్వామి ఆలయ భూములు దాదాపు 282 ఎకరాల వరకు ఉన్నది. అట్టి భూములలో స్కిల్ యూనివర్సిటీ కోసం 25 ఎకరాల భూమిని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని ఆలయ కమిటీ చైర్మన్ అక్కపల్లి రామిరెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఆలయ ఎండోమెంట్ భూమిలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఈ స్కిల్ యూనివర్సిటీ వలన ఇక్కడి ప్రాంతం యువత ఉపాధి పొందడానికి మెండుగా అవకాశాలు ఉంటాయని మండల ప్రజలు భావిస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి వెంటనే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడిప్పుడే మెదక్ నియోజకవర్గానికి విద్యాసంస్థలను ఎమ్మెల్యే రోహిత్ రావు శరవేగంగా మంజూరి చేస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల కూడా తీసుకురావడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. స్కిల్ యూనివర్సిటీని కూడా చల్మెడ ప్రాంతంలో కట్టించాలని కోరారు.

స్కిల్ యూనివర్సిటీకి అనుకూలమైన స్థలం

-బాజే రమేష్ , చల్మెడ ఆలయ కమిటీ డైరెక్టర్



స్కిల్ యూనివర్సిటీ తిరుమల స్వామి ఆలయ భూమిలో ఏర్పాటు చేయాలి. ఇక్కడ ప్రశాంతమైన వాతావరణం ఉంటుంది. ఆలయ భూముల చుట్టూ చెట్లు చెరువు, కుంటలతో కూడుకొని ఉన్నది. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, మెదక్ ఎంపి రఘునందన్ రావులు ప్రత్యేక చొరవ తీసుకొని ఈ ప్రాంత అభివృద్ధి కోసం స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి.

స్కిల్ యూనివర్సిటీని వెంటనే ఏర్పాటు చేయాలి

-ఆలయ కమిటీ చైర్మన్, అక్కపల్లి రామ్ రెడ్డి



స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లయితే ఇక్కడి ప్రాంత ప్రజలే కాకుండా ఎంతోమంది యువతకు ఉపాధి చూపడానికి మంచి అవకాశాలు ఉన్నాయి. యువతకు వారి వారి నైపుణ్యాలను బట్టి శిక్షణ ఇచ్చి ఉద్యోగా లను కల్పించడం కూడా జరుగుతుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చల్మెడ శివారులో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి. 25 ఎకరాల భూమిని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. ఆలయ కమిటీ ఏకగ్రీవ తీర్మానం చేసి 25 ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పజెప్తాం.

పండుగ పూట పస్తులుండాల్సిందేనా..?

- గ్రామపంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షులు వెంకటేష్.
- వేతనాలు రాక అప్పులు చేస్తున్నామని ఆవేదన
- ప్రభుత్వం ఇబ్బందులు పెడుతుందని మండిపాటు



నవతెలంగాణ-శివ్వంపేట

గత తొమ్మిది నెలలుగా ప్రభుత్వం నుండి వేతనాలు రాక ఎన్నో రకాలుగా ఇబ్బందులు పడుతున్నామని, పండగ పూట తమ కుటుంబాలన్నీ కూడ పస్తులుండాల్సిందేనా అని గ్రామపంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షులు వెంకటేష్ మండిపడ్డారు. తొమ్మిది వేతనాలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని గురువారం మండల పరిషత్ కార్యాలయం ముందు గ్రామపంచాయతీ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో కుటుంబం గడవక అప్పులు తెచ్చుకుని పిల్లల్ని పోషించుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పని భారం ఎక్కువై తిండి తినడానికి కూడ సమయం దొరకకుండా పనులు చేయిస్తూ జీతాలు మాత్రం అందించకుండా గ్రామపంచాయతి కార్మికులను ప్రభుత్వం తీవ్రంగా ఇబ్బందులు పెడుతోందని ఆయన దుయ్యబట్టారు. చాలీ చాలని వేతనాలకు పని చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వం నెల నెల జీతాలు అందించకపోతే తమ కుటుంబాలు ఎలా పోషించుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పెండింగ్ వేతనాలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయకుంటే గ్రామ పంచాయతీ కార్మికులమంతా సమ్మెకు దిగుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల గ్రామపంచాయతీ కార్మిక సంఘం కోశాధికారి వసంత, పద్మ,కిచ్చనోళ్ల నర్సిములు, పెద్దకోళ్ల అశోక్, ఆగమయ్య, సరమ్మ, లింగోజీగూడ బిక్షపతి, రాములు నాయక్,తదితరులు పాల్గొన్నారు.

ఒడిసి పట్టు.. పంటలు పండించు

- సేహగల్ స్వచ్ఛంద సంస్థ నిర్మించిన చెక్ డ్యామ్ ప్రారంభోత్సవం
- పిసిసి ప్రధాన కార్యదర్శి నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి



నవతెలంగాణ-వెల్దుర్తి

వృధాగా పోతున్న వర్షపు నీటిని ఒడిసి పడితే పంటలు పండించుకోవడానికి ఎంతో ఉపయోగపడతాయని, మంచి సంకల్పంతో మండల పరిధి మానేపల్లి గ్రామ శివారులో సేహగల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్మించబడిన చెక్ డ్యాంను గురువారం పిసిసి ప్రధాన కార్యదర్శి నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మల్లికార్జున్ సునీల్ బాలరాజ్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సకల జీవకోటికి ప్రాణదారమైన జలాన్ని ఒడిసిపట్టి పంటలు పండించుకోవడానికి చెక్ డ్యాం నిర్మాణం చేపట్టి మానేపల్లి మంగళపర్తి ఇరు గ్రామాల రైతులకు ఎంతో మేలు చేశారని కొనియాడారు. సేహగల్ స్వచ్ఛత సంస్థ మెదక్ జిల్లాలోని వెల్దుర్తి మండలంలో మానేపల్లి గ్రామ శివారులో 45 రోజుల్లోనే చెక్ డాం నిర్మాణం చేసి వాడుకలోకి తెచ్చిన ఘనత వారికే దక్కిందని కొనియాడారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా మరిన్ని కార్యక్రమాలు చేసి ప్రజలకు ఉపయోగంలోనికి తీసుకురావాలన్నారు. గ్రంథాల సంస్థ చైర్పర్సన్ సుహాసిని రెడ్డి మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా జిల్లాలో గ్రంథాలయాల పునరుద్ధం కోసం సహకారాలు అందించి యువతకు అందుబాటులోనికి తీసుకురావడానికి మీ వంతు సహాయ సహకారాలు అవసరమన్నారు. ఈ చెక్ డ్యామ్ కాపాడుకోవడానికి మీ గ్రామంలోని కొంతమంది ముందుకు వచ్చి ఏమైనా లోటు పాట్లు జరిగితే సరి చూసుకునే బాధ్యత మీ గ్రామంపై ఉందని సేహగల్ ప్రాజెక్టు ప్రతినిధులు అన్నారు. అతి తక్కువ కాలంలో చెక్ డ్యాం నిర్మాణానికి గ్రామస్తుల, ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో ఉపయోగపడిందన్నారు.



కింది భాగంలో మరొక్క చెక్ డ్యాముల నిర్మాణం చేపడితే కుకునూరు మానేపల్లి తాండవ వాసులకు ఎంతో ఉపయోగపడుతుందని గ్రౌండ్ వాటర్ పెరిగి బోర్లు పుష్కలంగా పెరిగి పంటలు బాగా పండించుకోవడానికి ఉపయోగపడుతుందని సభా దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఇరిగేషన్ డి ఈ రాజేందర్ మరో చెక్ డాం నిర్మాణం కోసం కోటి 20 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి, నరసింహారెడ్డి, తలారి మల్లేశం, పోతిరెడ్డి, అందువలనపల్లి శీను, రెండు గ్రామాల ప్రజలు తాండవాసులు ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం





నవతెలంగాణ -నిజాంపేట

మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలోని ఎంపియుపిఎస్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. అందులో భాగంగా పిట్ల మనస్విని ప్రధానోపాధ్యాయురాలుగా, ఊడెపు రితన్య ఉపాధ్యాయులుగా యశస్విని, అక్షిత, తేజ శ్రీ, అలేఖ్య, అను శ్రీ, లాస్య, భవ్య శ్రీ, నవదీక్షిత్ నిశాంతులు బాధ్యతలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-టేక్మాల్

టేక్మాల్ మండల పరిధిలోని వేల్పుగొండ గ్రామంలో మండల పరిషత్తు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించారు. ఎంఈఓగా వర్ష ప్రధానోపాధ్యాయులుగా విశాల్ ఉపాధ్యాయులుగా మహేశ్వరి, శ్రీనిధి, శ్వేత పవిత్ర, నియమించబడ్డారు. స్వయం పరిపాలన దినోత్సవంలో ప్రధానోపాధ్యాలు విశాల్ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చిన ఉపాధ్యాయుల బృందానికి తోటి ఉపాధ్యాయులుగా అయిన వారికి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్, ఉపాధ్యాయులు సంతోష్ గౌడ్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పద్మ విద్యార్థులు బోధన తరగతులను పర్యవేక్షించి ఉత్తమ బోధన కనబరిచిన విద్యార్థులకు బహుమతులు మెమోంటోలు అందచేశారు.

కడుపునొప్పి భరించలేక బాలిక ఆత్మహత్య



నవతెలంగాణ-మెదక్‌డెస్క్

కడుపునొప్పి భరించలేక బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన జగదేవపూర్ మండలంలోని మునిగడప గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నర్రా ప్రవళిక (14) మునిగడప ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. ప్రవళిక గత కొద్ది రోజుల నుంచి తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుంది. గతంలో డాక్టర్‌ని సంప్రదించి నప్పటికీ తాత్కాలికంగా ఉపశమనం తప్ప ఆమె కడుపు నొప్పి పూర్తిగా తగ్గలేదు. అప్పుడప్పుడు తరచు నొప్పితో బాధపడుతూ ఉండేది. అదేవిధంగా గురువారం ఉదయం మళ్ళీ తీవ్రమైన కడుపు నొప్పి రాగ, ఆమె తన తండ్రికి తెలియచేయగా, కొద్దిసేపట్లో హాస్పిటల్‌కి వెళ్దాం నేను బయటకి వెళ్ళొస్తా అని బయటకి వెళ్ళగా, అట్టి సమయంలో ఇంట్లో ఎవరు లేనందున కడుపు నొప్పిని భరించలేక ఇంట్లోనే సీలింగ్ ఫ్యాన్‌కి చున్నీ సాయంతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. కొద్దిసేపటికి తల్లి వచ్చి ఇరుగుపొరుగు వారి సాయంతో తలుపులు తెరిచి ప్రభుత్వ హాస్పిటల్ గజ్వేల్‌కి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినదని డాక్టర్ తెలియచేశారు. తన కూతురు కడుపునొప్పి భరించలేకనే ఆత్మహత్య చేసుకొని చనిపోయింది అని తండ్రి నర్రా బాలేష్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు జగదేవపూర్ ఎస్ఐ చంద్రమోహన్ తెలియచేశారు.

ఎస్పీని కలిసిన జిల్లా డీవీఎంఎస్ సభ్యులు



నవతెలంగాణ-చౌటకూర్

సంగారెడ్డి జిల్లాకు నూతనంగా వచ్చిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌ను జిల్లా పోలీస్ కార్యలయంలో ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పంబల్ల దుర్గాప్రసాద్, కాశపాగ ఇమ్మయ్య గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ..జిల్లా ప్రజలకు మంచి సేవ లు అందించాలని ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో రాజు నాయక్, బంటు రామకృష్ణ, మాచునూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్సీ కవితకు శుభాకాంక్షలు తెలిపిన శంబభీపూర్ రాజు



నవతెలంగాణ-జిన్నారం

నిజామాబాద్ ఎమ్మెల్సీ కవితను మేడ్చల్ మల్కాజ్గిరి బీఆర్ఎస్ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ రాష్ట్ర యువనేత జిన్నారం వెంకటేశం గౌడ్‌లు గురువారం ప్రత్యేకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత వారిని ఆత్మీయంగా పలకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

శాంతియుత వాతావరణంలో పండుగలు జరపాలి



నవతెలంగాణ-సదాశివపేట

సీఐ మహేష్ గౌడ్ అధ్యక్షతన కొండాపురం, మునిపల్లి మండలాల పోలీసుల ఆధ్వర్యంలో ఎంజి బ్యాంకెట్ హాల్‌లో గురువారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. పట్టణంలోని మైనారిటీ, హిందూ సంఘాలు, పలు పార్టీల రాజకీయ ప్రముఖులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. ఓ వైపు హోలీ, మరోవైపు రంజాన్ మాసం సందర్భంగా శుక్రవారం నిర్వహించే ప్రార్థనలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. సర్వమత సమ్మేళనంతో పట్టణంలో శాంతి నెలకొల్పే విషయంలో ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశానికి పట్టణంలోని వివిధ మతాల పెద్దలు, పుర ప్రముఖులు హాజరై శాంతియుతంగా పండగలు జరుపుకుంటామన్నారు.

ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో ఎంపీడీఓ తనిఖీలు



నవతెలంగాణ-చౌటకూర్

మండలంలోని బొమ్మారెడ్డి గూడెంలో గల ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలనుఎంపీడీవో కే.శంకర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోజువారి మెనూ ప్రకారం మంచి పౌష్టిక ఆహారాన్ని విద్యార్థుకు అందించాలని, నీటి కొరత లేకుండా చూసుకోవాలని వార్డెన్‌కు సూచించారు. అదేవిధంగా చేతులు శుభ్రంగా కడుక్కున్న తర్వాతే వంట చేయాలని సిబ్బందికి సూచించారు. పరిసరాలు, మరుగుదొడ్లు అన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని వార్డెన్ శోభను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. పిల్లలందరూ కష్టపడి బాగా చదువుకోవాలన్నారు. ఎలాంటి ఇబ్బంది ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తరువాత పిల్లలతో కలిసి సహపంక్తి భోజనం చేయశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్, సీఆర్పీ ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండోరోజు తహసీల్ ఎదుట నిరసన



నవతెలంగాణ-జహీరాబాద్

ఎస్సీ వర్గీకరణ లేకుండానే తెలంగాణలో ఉద్యోగాల పరీక్ష ఫలితాల ను విడుదల చేయడానికి కుట్రలు చేస్తున్నారని. అందుకు నిరసనగా జహీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం రెండోరోజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు అబ్రహం మాదిగ మాదిగ మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సి వర్గీకరణపై చట్టం చేస్తామని ఒకవైపు చెప్తూనే, మరొక వైపు ఆగమేఘాల మీద ఉద్యోగ పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరో మెప్పు కోసం తలొగ్గి నమ్మిన మాదిగలకు సీఎం రేవంత్‌రెడ్డి ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. వర్గీకరణ జరిగిన తర్వాతనే పరీక్షా ఫలితాలు విడుదల చేయా లన్నారు. ఈ కార్యక్రవ ంలో ఎమ్మార్పిఎస్, ఏంఎస్పీ, ఎంఈఎఫ్ నాయకులు రాంచందర్, జైరాజ్, అరుణ్, ఆనంద్, జైపాల్, దిలీప్, దింపుల్, పవన్ కుమార్, శివప్ప, రాకేష్, అజయ్ మాదిగలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పని ప్రదేశాన్ని పరిశీలించిన ఏపీడీ



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని గంగ్వార్ గ్రామంలో ఉపాధి హామీ పనులను ఏపీడీ పూజ గురువారం పరిశీలిం చారు. అజోలా కల్టివేషన్‌కు సంబం ధించి నిర్వహణ హౌస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధి కూలీలు పనిచేసే పనుల ప్రాంతాన్ని సందర్శించి.. ఎండ లో పని చేయొద్దని సూచించారు. కూలీలకు కొలతల ప్రకారం డబ్బులు చెల్లిస్తాం'ని చెప్పారు. 60 మందికి కూలీలు తగ్గకుండా ఉపాధి పనులు నిర్వహించాలని ఆదేశించారు. ఉపాధి కూలీలకు తాగునీరు, తగిన సౌకర్యాలు కల్పించేలా గ్రామ పంచాయతీ సెక్రటరీకి వివేక్ చర్యలు తీసుకోవాలన్నారు. కూలీల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్, ఏపీఓ రంగారావు, టెక్నికల్ అసిస్టెంట్ రాము, గ్రామ సెక్రెటరీ వివేక్, ఫీల్డ్ అసిస్టెంట్ సుకుమార్, కూలీలు గ్రామస్తులున్నారు.

జగదీష్ రెడ్డి సస్పెండ్ పట్ల ఖండన



నవతెలంగాణ-టేక్మాల్

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే నెపంతో జగదీష్ రెడ్డిని అసెంబ్లీ సభ నుంచి సస్పెండ్ చేయడాన్ని బీఆర్‌యస్ నాయకుడు నరేష్ చారి తీవ్రంగా ఖండించారు. ప్రజల కోసం ప్రజల పక్షాన ఉంటూ పోరాటం చేస్తున్న ఎమ్మెల్యేను సస్పెండ్ చేయడం సిగ్గుచేటన్నారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కాలని ప్రయత్నం చేస్తే రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజాక్షేత్రంలో ప్రజలే బుద్ధి చెప్తారన్నారు.

నవతెలంగాణ
సిద్దిపేట
శుక్రవారం | 14 మార్చి 2025 | www.navatelangana.com

ఉచిత దంత వైద్య శిబిరం



నవతెలంగాణ-నంగునూరు

మండలంలోని పాలమాకుల గ్రామ లిటిల్ ఫ్లవర్ హై స్కూల్‌లో గురువారం ఉచిత దంత వైద్య శిబిరం చేపట్టారు. శ్రీనివాస సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల, బాలాజి ఈఎన్‌టీ వైద్యశాల వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత దంత, ముక్కు, చెవి, గొంతు పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ల బృందం విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి, విద్యార్థులకు అవసరమైన మందులు, టూత్ పేస్ట్‌తో పాటు సలహాలు, సూచనలు ఇచ్చారు. పాఠశాలలో నిర్వహించినందుకు గాను పాఠశాల తరపున శ్రీనివాసా సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పటల్, బాలాజి ఈఎన్‌టీ హాస్పిటల్ వైద్య బృందానికి ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రముఖ దంత వైద్యులు శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ.. నోటి క్యాన్సర్ గురించి పిల్లలకు, పాఠశాల సిబ్బందికి వివరించారు.ఈ కార్యక్రమంలో వైద్యులు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎల్ శ్రీనివాస్ నాయక్ , డాక్టర్ సాహితీ,డాక్టర్ నాగరాజు,రాజగోపాల్ పేట ఎస్సై ఆసిఫ్, పాఠశాల ప్రిన్సిపాల్ వర్గీస్ , డైరెక్టర్ పట్బోజు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విచారణ జరిపిన విద్యాశాఖ అధికారి



నవతెలంగాణ-చేర్యాల

2024-25 విద్యా సంవత్సరం పూర్తి కాకముందే వచ్చే విద్యా సంవత్సరానికి ముందస్తుగా అడ్మిషన్లు తీసుకుంటున్న చేర్యాల పట్టణంలోని శ్రీ చైతన్య ఒక్లే విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం మండల విద్యా శాఖ అధికారికి అందజేసిన వినతిపత్రం మేరకు గురువారం శుభోదయ పాఠశాల(శ్రీ చైతన్య), ఒక్లే పాఠశాలలను సందర్శించి విచారణ జరిపినట్లు మండల విద్యాశాఖ అధికారి రచ్చ కిష్టయ్య తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి ఇకముందు ముందస్తుగా అడ్మిషన్ల కోసం ప్రచారం చేయమని, పాఠశాలలో పుస్తకాల విక్రయాలను నిలిపివేస్తామని ఇలాంటి తప్పిదం మరోసారి చేయమని ఇరు పాఠశాలల యాజమాన్యాలు తెలిపినట్లు విద్యా శాఖ అధికారి పేర్కొన్నారు.

నలుగురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్

నవతెలంగాణ-సిద్దిపేట

గురువారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం గణితం, జంతు శాస్త్రం పరీక్షలో నలుగురు విద్యార్థులు చిట్టీలు రాస్తూ దొరకడంతో వారిని మాల్ ప్రాక్టీస్ కింద బుక్ చేసినట్టు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ముట్రాజ్ పల్లి జూనియర్ కళాశాలలో ముగ్గురు, గజ్వేల్ హబ్ లోని సెంటర్‌లో ఒకరు చిట్టీలు రాస్తుండగా బోర్డు నుండి వచ్చిన స్క్వాడ్స్ పట్టుకున్నారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 8921 విద్యార్థులు హాజరయ్యారని, 498 మంది గైరాజర్ అయినట్లు తెలిపారు.

నేడు హోలీ పండుగను విజయవంతం చేయండి



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో శుక్రవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో జరిగే హోలీ పండుగను విజయవంతం చేయాలని పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్ తెలిపారు. పట్టణ యువకులు సంబరాల్లో పాల్గొనాలని ఆయన కోరారు. పార్టీల కతీతంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. గతంలో కూడా కాంగ్రెస్ హయాంలో హెూలీ సంబరాలు నిర్వహించామని ఆయన గుర్తు చేశారు. ఈ సంవత్సరం కూడా భారీగా నిర్వహిస్తున్న మన్నారు.

హోలీ చిత్రాన్ని ఆవిష్కరించిన రుస్తుం



నవతెలంగాణ-సిద్దిపేట

హోలీ పండుగ సందర్భంగా ప్రముఖ రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో అంతర్జాతీయ చిత్రకారులు రుస్తుం హోలీ చిత్రాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగులు మనిషి జీవితాన్ని కళావంతం చేస్తాయని అన్నారు. హోలీ ఆట ఆడినప్పుడు చిన్నారులు జాగ్రత్తలు తీసుకోవాలని, రసాయనిక రంగులు వాడవద్దని, కేవలం సహజ రంగులను మాత్రమే వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్. ఏ. ఎఫ్ అధ్యక్షురాలు జులేఖరుస్తుం, నైరూప్య చిత్రకారుడు నహీం రుస్తుం, అసిస్టెంట్ ప్రొఫెసర్ రూబీనారుస్తుం, మహ్మద్ సాధిక్, ఎండి రహీం తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-ములుగు

మండల కేంద్రమైన ములుగులో గురువారం ఉదయం మృతి చెందిన తాడెం బాలనర్సమ్మ కుటుం బని పరామర్శించి వారి కుటుంబానికి జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీంతో కలిసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కడపల నరసింహారెడ్డి ఆర్థిక సాయం అందజేశాడు. వారితోపాటు ములుగు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండు నరసింహులు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు సుతారి మహంకాళి, బుడిగే సంజీవులు, తదితరులు ఉన్నారు.

కొమ్మూరి ప్రతాప్ రెడ్డికి మాతృవియోగం



నవతెలంగాణ-మద్దూరు

జనగామ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చేర్యాల మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, తల్లి కొమ్మూరి సత్తవ్వ, 87 బుధవారం రాత్రి మృతి చెందారు. సత్తవ్వ పార్థివ దేహాన్ని స్వగ్రామమైన నర్సాయ పల్లి, గ్రామంలోని తన సొంత ఇంట్లో ఉంచడంతో వివిధ పార్టీల నాయకులు సత్తవ్వ పార్థివ దేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

యువత అగ్నివీర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలి

- ఆజాద్ డిఫెన్స్ అకాడమీ చైర్మెన్ నీలా చంద్రం



నవతెలంగాణ-రాయపోల్

భారత సైన్యంలో 2025-26 సంవత్సరానికి అగ్నివీర్ విభాగంలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని ఆజాద్ డిఫెన్స్ అకాడమీ చైర్మెన్ రిటైర్డ్ ఆర్మీ నీల చంద్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్నివీర్ విభాగంలో జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్, స్టోర్ కీపర్, ట్రేడ్స్ మెన్ విభాగాలలో పోస్టులు భర్తీ చేయనున్నట్లు సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయం ప్రక టనలో తెలిపిందన్నారు. ఈనెల 12 నుంచి ఏప్రిల్ 10 మధ్య ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. నిరుద్యోగ యువత యావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వరల్డ్ రికార్డ్ సాధించిన పంజాల కార్తీకకు సన్మానం



నవతెలంగాణ-దౌల్తాబాద్

ఆవర్తన మూలకాలను అతి తక్కువ సమయంలో కంఠస్థం చేయడంతో ప్రపంచ రికార్డు సృష్టించిన బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న పంజాల కార్తికకు గ్రామ యువత సన్మానం ఘన సన్మానం చేసి అభినందనలు తెలిపారు. గురువారం దౌల్తాబాద్ మండలం మాచిన్ పల్లి గ్రామంలో విద్యార్థి కార్తీక గ్రామస్తులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మాచిన్ పల్లి గ్రామ యువత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం



నవతెలంగాణ-గజ్వేల్

రానున్న రోజుల్లో తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని గజ్వేల్ మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహేష్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, రేషన్ కార్డులు, మహిళలకు బస్సు ప్రయాణం రైతు ఏకకాలంలో రుణమాఫీ, చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వంలో పేద ప్రజలను పట్టించుకునే నాధుడే లేదన్నారు. అలాగే హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఎండిన వరి పంటలను పరిశీలించిన సీపీఐ(ఎం) బృందం

- ఎండిన వరి పంటలకు ఎకరాకు రూ.50వేల నష్ట పరిహారం ఇవ్వాలి
- సీఎం రేవంత్ రెడ్డికి ముందు చూపు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి
- సీపీఐ(ఎం)సిద్దిపేట జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో



నవతెలంగాణ-చేర్యాల

వర్షాభావ పరిస్థితుల వల్ల ఎండిపోయిన వరి పంటకు ఎకరానికి రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ(ఎం)సిద్దిపేట జిల్లా కమిటి సభ్యులు కొంగరి వెంకట మావో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని తాడూరు, చిట్యాల, దానంపల్లి, కమలాయ పల్లి, అర్జున్ పట్ల తదితర గ్రామాల్లో ఎండిన వరి పంటలను గురువారం సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం సందర్శించి పరిశీలించారు. అనంతరం కొంగరి వెంకట మావో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డికి ముందు చూపు లేకపోవడం వల్ల దేవాదుల ప్రాజెక్టులను నీళ్లతో నింపకపోవడంతో గ్రామాల్లో చెరువులు, కుంటలు, బోర్లు అడుగంటి పోయి రైతులు వేసిన వరి పంటలు మొత్తం ఎండిపోయిన పరిస్థితి నెలకొందన్నారు. ఎకరం భూమి ఉన్న రైతు రూ.30వేల నుంచి రూ.40 వేలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారని తెలిపారు. ఎండిన పంటలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఎకరాకు రూ. 50వేలు నష్టపరిహారం ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి పంటలను సర్వే చేసి నష్ట పరిహారం అందించి జిల్లాలో ఉన్న దేవాదుల ప్రాజెక్టులను నీళ్లతో చెరువులు, కుంటలను నింపి మిగిలిన పంటలను రక్షించి రైతులను ఆదుకోవాలని కోరారు. లేని పక్షంలో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఇబ్బందులు పడుతుంటే తమ పార్టీ ఎర్రజెండా చూస్తూ ఊరుకోదని, రైతులను సమీకరించి పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా రైతులకు ఇచ్చిన హామీలు అన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పరిశీలన బృందం లో ఆ పార్టీ మండల కార్యదర్శి బండకింది అరుణ్, మండల కమిటి సభ్యులు సూర్ణ తిరుపతి, వివిధ గ్రామాల శాఖ కార్యదర్శులు మల్కని ఎల్లయ్య, బొడిగం చంద్రారెడ్డి, చెండి రాజు, ఇర్రి భూమయ్య, నర్ర పోషిరెడ్డి, తదితరులు ఉన్నారు.

మహిళలకు అందుబాటులో అన్ని రకాల చట్టాలు

- లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా సెక్రటరీ స్వాతి రెడ్డి
- మహిళలు అన్ని రంగాల్లో ఉన్నారు
- అడిషనల్ కలెక్టర్ గరీమ అగ్రవాల్



నవతెలంగాణ-సిద్దిపేట

అప్పట్లో మహిళలకు హక్కులు ఇవ్వలేదని, ఇప్పుడు మహిళలకు హక్కులు ఉండటం వలెనే మహిళలు ఈ స్థాయిలో ఉన్నారని, మహిళలకు అన్ని రకాల చట్టాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా సెక్రెటరీ స్వాతి రెడ్డి అన్నారు. జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం టీటీసీ భవన్‌లో స్వార్డ్ ఆర్గనైజేషన్ వారితో లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 30 ఏండ్ల క్రితంతో పోల్చితే రోజురోజుకి మహిళలు అన్ని రంగాలలో పని చేస్తున్నారని, ముందుకు సాగుతున్నారాని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాలలో స్త్రీ, పురుషులతో సమానమని చెప్పారు. మహిళలు అన్ని రంగాలలో ఉద్యోగాలు చేస్తున్నారని, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక కార్యక్రమాల్లో స్త్రీ, పురుషులు సమానమని చెప్పారు. కుటుంబం సహకరిస్తే మహిళలు ఇంకా చాలా గొప్ప స్థాయికి ఎదుగుతారు అని చెప్పారు. అనంతరం మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమములో స్వార్డ్ సంస్థ నిర్వాహకురాలు శివకుమారి, టీఎన్జీవో వినయ సుకుమారి, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం ఎల్లారెడ్డిపేట గ్రామంలో బీరప్ప ఆలయం వద్దకు వెళ్లే దారిలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన రూ.10 లక్షల నిధులతో నిర్మాణం చేస్తున్న సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ఆయా గ్రామాలలో ఎన్ఆర్ఇజీఎస్ నిధుల ద్వారా సీసీ రోడ్ నిర్మాణం పనులు కొనసాగుతు న్నాయన్నారు. అన్ని గ్రామాలలో సీసీ రోడ్ నిర్మాణానికి నిధు లు మంజూరు చేసి నిర్మాణం చేసే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గాంధారి నరేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అక్కను స్వామి, కుర్మా సంఘం మండల అధ్యక్షు లు దేవుని పోచయ్య, మాజీ సర్పంచులు పాగాల కొండల రెడ్డి, కొంగరి నర్సింలు, నాయకులు, పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగ, మెడిటేషన్ ఎంతో ఉపయోగం

- హెూలీ పండుగ జాగ్రత్తలు తీసుకోవాలి



నవతెలంగాణ-గజ్వేల్

విద్యార్థులకు యోగ, మెడిటేషన్ ఎంతో ఉపయోగమని, గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలోని విద్యార్థులు అందరూ పాఠశాలలో క్లాసుల ప్రారంభం కంటే ముందు యోగా, మెడిటేషన్ చేసి వారి తరగతులలోకి వెళ్ళిపోతున్నారని కొడకండ్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధునాల శ్రీనివాస్ అన్నారు. గురువారం తరగతి గదిలో ఆయన మాట్లాడుతూ.. ఇలా చేయడం ద్వారా వారికి మానసిక ప్రశాంతత చెప్పిన పాఠాలు తొందరగా నేర్చుకుంటారన్నారు. అదేవిధంగా పండుగలన్ని పర్యావరణ పరిరక్షణ మానవ జీవన వికాసానికి ఉపయోగపడాలని, ముందస్తు హెూలీ పండుగ శుభాకాంక్షలు జాగ్రత్తలు తెలిపారు. చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ ఆనందోత్సాహంగా నిర్వహించుకుంటారు. హెూలీ పండుగను పిల్లలు ఆనందంగా సురక్షితంగా జరుపుకోవడానికి కొన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇందులో భాగంగానే పిల్లలు ముఖానికి కాళ్లకు కొబ్బరి నూనె లేదా బాదాం నూనె రాసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తదితరులున్నారు.

క్రిస్టియన్ కళాకారుల జాయింట్ సెక్రటరీగా క్రిస్టఫర్



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

అలుపెరుగని విరామము లేని సేవకుడు రెవ.యస్. క్రిస్టఫర్ తెలంగాణ స్టేట్ క్రైస్తవ కళాకారుల జెయింట్ సెక్రెటరీగా నియమి తుల య్యారు. గురువారం యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ ఫెలోషిప్ గజ్వేల్ నియోజకవర్గం వైస్ ప్రెసిడెంట్ రెవ యస్. క్రిస్టఫర్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిగర్వి నిడారంబరుడు మృదుస్వభావి ప్రేమకు మారుపేరు సేవకుల సమస్యలు తన సమస్యగా భావించి సేవలు చేస్తున్నారన్నారు. ప్రతినిత్యం క్రైస్తవ ప్రజా సేవలో నడుస్తున్న క్రైస్తవ ప్రజా సేవకుడు నిత్యం నశించిపోతున్న ఆత్మల పట్ల భారం కలిగి సేవ చేస్తున్న వ్యక్తి గా గుర్తింపు పొందా డన్నారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ యూని యన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సహజ రంగులతోనే హోలీ ఆడండి





నవతెలంగాణ-సిద్దిపేట

హెూలీ సహజ రంగులతోనే ఆడాలని, రసాయనిక రంగుల వలన చర్మవ్యాధులు వచ్చే అవకాశం ఉన్నాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సునీత తెలిపారు. వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సహజ రంగులతో ఘనంగా హెూలీ సంబరాలు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వృక్ష శాస్త్ర విభాగాధిపతి రాణి కొమ్మిడి, వైస్ ప్రిన్సిపల్ డా. పి అయోధ్య రెడ్డి, ఐ.క్యు.ఏ.సి కోఆర్డినేటర్ డా.సి హెచ్ మధుసూదన్, వృక్షశాస్త్ర అధ్యాపకులు డా. ఎస్ శైలజ, ఆర్ స్రవంతి, డా.మిరాజ్ ఫాతిమా, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-రాయపోల్

రంగుల పండుగ హోలీ అంటే అందరికి ఎంతో ఉత్సాహం. చిన్న పెద్ద అనే తారతమ్యం లేకుండా వివిధ రంగులను స్నేహితులపై, కుటుంబ సభ్యుల, బంధువులపై చల్లుకుంటూ ఎంతో ఉత్సాహంగా నిర్వహించుకునే పండగని బేగం పేట ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయులు ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం రాయపోల్ మండలం బేగంపేట ప్రాథమిక పాఠశాలలో హెూలీ సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెూళీ పండుగనాడు రంగులను వరసైన వారి మీద చల్లుతూ ఉత్సాహంతో, సంతోషంతో గడుపుతూంటారు. హెూళీ పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిఆర్పి యాదగిరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రియంబర్మెంట్‌లను వెంటనే విడుదల చేయాలి


- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బత్తుల అభిషేక్ భాను, ఆముదాల రంజిత్ రెడ్డి
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా
- విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్



నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

పెండింగ్ స్కాలర్షిప్ ఫీజు రియంబర్మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బత్తుల అభిషేక్ భాను, ఆముదాల రంజిత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని, విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కారం చేయడంలో గత ప్రభుత్వ వైఖరినే ఈ ప్రభుత్వం కూడా అవలంబిస్తుందని గురువారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్లో 30 శాతం నిధులు కేటాయించి అభివృద్ధి పరచాలని, రాష్ట్రంలో ప్రతి ఏడాది విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయం జరుగుతుందన్నారు. పెండింగ్స్ స్కాలర్షిప్స్ ఫీజు రియంబర్స్మెంట్ వేలాది కోట్ల రూపాయలు ఉన్నాయని వాటిని విడుదల చేయక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు. ఒకవైపు కళాశాల యాజమాన్యాలు ఫీజుల పేరుతో విద్యార్థులను వేధిస్తున్నారని వారు పేర్కొన్నారు. గురుకు లాలు సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు అద్దె భవనాలల్లో కాలం వెళ్ళదీస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో విద్యా ర్థుల సమస్యలను పరిష్కారం చేయాలని లేనిపక్షంలో గత ప్రభుత్వాలకు పట్టిన గతే ఈ ప్రభుత్వానికి కూడా పడు తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కోనేరు ప్రవీణ్ కుమార్ జిల్లా నాయకులు ముత్యం, సాయికుమార్, హర్షవర్ధన్, నవదీప్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'నవతెలంగాణ' కథనానికి విశేష స్పందన



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

మల్లన్న సాగర్ ప్రాజెక్టు నుంచి కూడవెల్లి వాగులోకి నీటిని విడుదల చేయాలనే శీర్షికతో వార్త బుధవారం నవతెలంగాణ దిన పత్రికలో ప్రచురితమైంది. దీనికి విశేష స్పందన లభించింది. భూగర్భ జలాలు అడుగంటి రైతులకు ఎన్నో ఇబ్బందులు వస్తున్నాయని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్ ప్రెస్ మీట్ నిర్వ హించారు. పంట పొట్టకొస్తున్న ఈ దశలో నీటి వినియోగం ఎక్కువగా ఉంటుందని, నీళ్లకోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంటనే అనుమతి ఇచ్చి వాగులోకి నీళ్లు విడుదల చేయాలని కోరారు. లేని పక్షంలో రైతంగం పక్షాన పోరాడతామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా నవ తెలంగాణలో ప్రచురితమైన వార్తకి ప్రభుత్వం అధికారులకు గురువారం ఆదేశాలు జారీ చేసింది. వెంటనే నీటిని విడుదల చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూసు కోవాలని పేర్కొంది. ఈ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గం రైతులు నవతెలంగాణ బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

అక్కెనపల్లి ఆదర్శ పాఠశాలలో 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్'



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం అక్కెనపల్లి ఆదర్శ పాఠశాలలో గురువారం ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం ప్రిన్సిపాల్ ఎం.జానయ్య అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రజల మధ్య పరస్పర అవగాహన పెంపొందించడం, భిన్నత్వంలో ఏకత్వాన్ని పెంచడం లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపట్టారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు సాంస్కృతిక సంబంధాలు ప్రోత్సహించడం కోసం భాష, అభ్యాసం, సంగీతం, క్రీడలు ఉత్తమ పద్ధతులను విద్యార్థులు అలవ ర్చుకోవడం కోసం పాఠశాలలో సాంస్కృ తిక కార్యక్రమాలు, పిరమిడ్ నిర్వహిం చారు. ప్రిన్సిపాల్ ఎం .జానయ్య మా ట్లాడుతూ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాం తాల సంస్కృతి సంప్రదాయాలు విద్యా ర్థుల భావోద్వేగాలను బంధాలను బలోపే తం చేస్తాయని పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కవయిత్రి మొల్ల 585వ జయంతి వేడుకలు





నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండలం కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో కవయిత్రి మొల్ల 585వ జయంతి వేడుకలు కుమ్మరి సంఘం నాయకులు గజ్వేల్ పట్టణంలో విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నిర్వహించారు. కుమ్మరి సంఘ నాయకులు మాట్లాడుతూ.. అతి తక్కువ కాలంలోనే తెలుగులో రామాయణాన్ని రచించిన కుమ్మరి బిడ్డ కవయిత్రి మొల్ల స్ఫూర్తి దాయకమని అన్నారు. అనంతరం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్, కాంగ్రెస్ నాయకులకి గజ్వేల్ మండల కుమ్మరి సంఘం పనులు త్వరగా పూర్తి కావాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కుమ్మర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగపురి రమేష్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గజ్వేల్ మండల అధ్యక్షుడు నాగపురి బాబు, ప్రధాన కార్యదర్శి తొవ్వల యాదగిరి, కోశాధికారి నాగపురి మహేష్ ,ఉపాధ్యక్షులు కొలిచేల్మే మల్లేశం, తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.

గజ్వేల్ రజక సంఘం ఆధ్వర్యంలో..

గజ్వేల్ రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం కవిత్రి మొల్ల జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం జిల్లాజిల్లా ఉపాధ్యక్షులు రామ్ గారి శ్రీధర్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. మొల్ల చరిత్రను ఆయన వివరించారు.

రాజీవ్ యువ వికాసం పథకం యువతకు మేలు

- కాంగ్రెస్ నాయకులు సికిందర్



నవతెలంగాణ-సిద్దిపేట

నిరుద్యోగ యువత ఉపాధి కోసం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంలో రూ.6 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశపెడుతున్నారని, యువతకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ నాయకులు సికిందర్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగ యువతకు ఒక్కో లబ్ధిదారుడికి రూ.3 లక్షల చొప్పున, 5 లక్షల మంది నిరుద్యోగులకు ఈ ఏడాది స్వయం ఉపాధి అందేలా ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నారన్నారు. మార్చి 15 నుంచి ఏప్రిల్ 5వ వరకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారని, ఏప్రిల్ 6 నుంచి దరఖాస్తుల పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక జరుగు తుందని తెలిపారు. జూన్ 2న ఎంపిక చేసిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేయబడునని, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జుబీర్, వెంకటేష్‌పాల్గొన్నారు.

ముదిరాజ్ గ్రామ సొసైటి, కమిటీ చైర్మెన్ ఏకగ్రీవం



నవతెలంగాణ-తొగుట

ముదిరాజ్ గ్రామ సొసైటి, పెద్దమ్మ తల్లి దేవాలయం కమిటీ చైర్మెన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామ ముదిరాజ్ సంఘం పెద్దలు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. గురువారం మండలంలోని వెంక ట్రావుపేట గ్రామంలో ముదిరాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముదిరాజ్ గ్రామ సొసైటి, పెద్దమ్మ తల్లి దేవాలయం కమిటీ చైర్మెన్‌లుగా కత్తుల నరేష్, బెజ్జనబోయిన రవిలను ముదిరా జుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు చెప్పారు. సొసైటీ వైస్ చైర్మెన్‌గా నాగులపల్లి నర్సింలు, కార్యదర్శి గా కంక ణాల శ్రీను, డైరెక్టర్ లుగా లింగంపేట శివలింగం, బెజ్జన బోయిన రవి, బొగ్గుల నరేందర్, సుతారి రాము లు, నాగు లప ల్లి యాదగిరి, బెస్తా స్వామి లను కమిటీని ఎన్నుకున్నారు.

విద్యార్థులకు బ్యాగులు, నోట్ బుక్స్ పంపిణీ

నవతెలంగాణ-చేర్యాల

మండల పరిధిలోని కడవేర్గు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం యూత్ ఫర్ సేవ స్వచ్ఛంద సంస్థ చే విద్యార్థులకు బ్యాగులు, జామెట్రీ బాక్సులు, డిక్షనరీ, నోట్ బుక్స్ పంపిణీ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. చంద్రశేఖర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడి, చదువుకోవాలని తపన కలిగిన విద్యార్థులకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. సహకరించిన పాఠశాల ఉపాధ్యాయులు పోలోజు లింగయ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వి.రమేష్. కృష్ణమూర్తి, రామకృష్ణ, కాంతీకృష్ణ, మమత, సాజీదా, అరుణ,ప్రీతి, సీఆర్‌పి రవీందర్, దినేష్, రమేష్, చంద్రశేఖర్ విద్యార్థులు పాల్గొన్నారు.



ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు భూమి పరిశీలన



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

హుస్నాబాద్ పట్టణ పరిధిలో కొత్తగా మంజూరి అయిన ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు 15 ఎకరాల భూమి కోసం గురువారం హుస్నాబాద్ పట్టణ పరిధిలో పలు ప్రాంతాలను శాతవాహన యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ఉమేష్ కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఉమ్మాపూర్ గ్రామ శివారులోని మహాసముద్రం గండి సమీపంలో గల ప్రభుత్వ స్థలం, జిల్లెలగడ్డలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సిల్ పాఠశాల పక్కన గల ప్రభుత్వ స్థలం, పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో గల స్థలాలను పరిశీలించారు. వీటిలో అనువైన స్థలం ఎంపిక చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఆయనతో పాటు ఆర్డీవో రామ్మూర్తి, తహశీల్దార్ రవీందర్ రెడ్డి, యూనివర్సిటీ బృందం తదితరులు పాల్గొన్నారు.

బాధితునికి రూ.4 లక్షల ఎల్‌ఓసీ అందజేత



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన వెల్దండి సత్తయ్య గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో హైద్రాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.4 లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. శ్రీరాములపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు పోలు శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పేద కుటుంబానికి చెందిన సత్తయ్య అనారోగ్యంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్ళగానే స్పందించారన్నారు. ఆపదలో ఉన్న కుటుంబానికి సహకరించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన వెంట గుండారెడ్డిపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు జాప రాజిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యాక్షుడు చింతకింది శంకర్, తదితరులు ఉన్నారు.

నూతన ఎంఆర్‌ఓను కలిసిన సీపీఐ(ఎం) బృందం



నవతెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి నూతన తహశీ ల్దార్(ఎంఆర్‌ఓ) దివ్యను గురువారం సీపీఐ(ఎం) పార్టీ బృందం మర్యాదపూ ర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, మండల కార్యదర్శి తాడూరి రవీందర్, ఐద్వా జిల్లా కార్యదర్శి అత్తిని శారద, జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి, మత్స్య కార్మిక సంఘం జిల్లా నాయకులు తేలు ఇస్తారి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బక్కెల్లి బాలకిషన్, మండల నాయకులు తాడూరి మల్లేశం, నీల బిక్షపతి, తదితరులు ఉన్నారు.

రైతుల ట్రాక్టర్లకు ఉచిత సర్వీసింగ్

నవతెలంగాణ-కొండపాక



చేర్యాలకు చెందిన కపీస్వర పవర్ ట్రాక్టర్ షోరూమ్ ఎస్కార్ట్ కంపెనీ వారి ఆధ్వర్యంలో కుకునూరు పల్లి మండలం మాత్ పల్లి గ్రామంలో రైతుల ట్రాక్టర్లకు ఉచిత సర్వీసింగ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సుమారు 60 ట్రాక్టర్లకు ఉచిత సర్వీసులు అందించారు. రైతులకు అండగా తమ షోరూం పలు సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాక్టర్ షోరూం డీలర్స్ సతీష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎస్కార్ట్ డాక్టర్స్ కంపెనీ ఆర్.ఎస్.ఎం శ్రీహరి ఏ ఎస్ ఎం అరుణ్ మహేష్ శ్రావణ్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలి



నవతెలంగాణ-గజ్వేల్

అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలనిబీజేపీ గజ్వేల్ పట్టణ, మండలాధ్యక్షులు మనోహర్ యాదవ్, అశోక్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఖాళీగా ఉన్న బోధనా సిబ్బందినీ వెంటనే భర్తీ, యూనివర్సిటీల బడ్జెట్ మేరకు బ్లాక్ గ్రాంట్‌ను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు చేప్యాల వెంకట్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు మద్దురి నర్సింహా ముదిరాజ్, నాయిని సందీప్ కుమార్, మైస విజయ్, భీం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ టౌర్నమెంట్‌కు అండర్ 14 క్రీడాకారులు

నవతెలంగాణ- గజ్వేల్



వనపర్తి జిల్లాకేంద్రంలోని ఈనెల 14 నుండి 16 వరకు డాక్టర్ బాలకిష్టయ్య క్రీడాప్రాంగణం లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ టౌర్నమెంట్‌కు అండర్ 14 బాల, బాలికల ఫుట్ బాల్ టౌర్నమెంట్ కు ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు వెళ్లారు. గజ్వేల్ ఫుట్బాల్ క్లబ్ నుండి నిశ్చిత, అక్షిత్, పవన్, మారుతి, మహాత్మ జ్యోతిరావు పూలే వర్గల్ రెసిడెన్షియల్ స్కూల్ నుంచి ఎంపికైన క్రీడాకారులు నీతిశ, వసంత, మనుశ్రీ, లహరిక లు కోచ్ రాంగారి నర్సింలు సమక్షంలో వనపర్తికి బయల్దేరి వెళ్లడం జరిగినది అని సిద్దిపేట జిల్లా ఫుట్బాల్ క్లబ్ అధ్యక్షులు రామ్ గారి గణేష్ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చక్రపాణి గౌడ్, సందబోయిన ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మధిర గ్రామమైన హుస్సేన్ నగర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఘనంగా స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. పాఠశాలలో పై తరగతి చదువుతున్న విద్యార్థులు తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు భోదించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాస్ లు పర్యవేక్షించారు.విద్యార్థులను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గొట్టిపర్తి రామస్వామి గౌడ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-కోహెడ

మండలంలోని తీగలకుంటపల్లి గ్రామానికి చెందిన వివాహిత వేల్పుల విమల (40) కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల విమల గర్భాశయ సమస్యతో ఆసుపత్రిలో చికిత్సపొందింది. తరచూ కడుపునొప్పి రావడంతో అస్వస్థతకు గురై నిరాశ చెందేది. మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా గమనించిన కుటుంబ సభ్యులు 108లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్



సిద్దిపేట మండలానికి చెందిన గోపాల మిత్ర మార్గడి వెంకట్ రెడ్డి ఇటీవల మృతి చెందారు. గురువారం ఉమ్మడి మెదక్ జిల్లా గోపాలమిత్ర సంఘం సభ్యుల ఆధ్వర్యంలో మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయన మృతి మాకు తీరనిలోటని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా గోపాల మిత్ర అధ్యక్షులు సింగం రాజు యాదవ్, రాష్ట్ర సలహాదారు శ్రీరాములు, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, కోశాధికారి గౌరీ శంకర్ ,మెదక్ జిల్లా అధ్యక్షులు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

నవతెలంగాణ-రాయపోల్



ట్రాక్టర్ అదుపుతప్పి డ్రైవర్‌కు గాయాలు అయినా సంఘటన రాయపోల్ మండల కేంద్రంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం ప్రకారం రాయపోల్ మండల కేంద్రానికి చెందిన బైండ్ల సత్తయ్య తన వ్యవసాయ పొలానికి ట్రాక్టర్‌పై యూరియా బస్తాలు వేసుకొని వెళ్లే క్రమంలో గ్రామంలోని దేవుని చెరువు కట్టపై నుంచి వెళ్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పి కట్టపై నుంచి కిందికి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సత్తయ్య రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ కి సమాచారం ఇవ్వగా దౌల్తాబాద్ అంబులెన్స్ సిబ్బంది మెడికల్ టెక్నీషియన్ భాను పైలెట్ నర్సింలు సంఘటన స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స అందించి తర్వాత మెరుగైన చికిత్స కోసం గజ్వేల్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ప్రాజెక్టు నిర్మించారు.. కాలువలు మరిచారు

- ఫీల్డ్ చానల్స్ లేక ఎండుతున్న పంటలు
- కాలువల కోసం భూ సేకరణ చేపట్టాలి

నవతెలంగాణ-సిద్దిపేట

చిన్నకోడూర్ మండల పరిధిలోని చందులాపూర్ వద్ద గత ప్రభుత్వం రంగనాయక సాగర్‌ను నిర్మించింది. మూడు టీఎంసీలు నిల్వ ఉండే విధంగా నిర్మాణం చేశారు. దీని పరిధిలో 1,50,000 ఎకరాల ఆయకట్టు సాగుకు నీరు అందించడానికి ప్రతిపాదనలు రూపొందించారు. కానీ ప్రాజెక్టు మాత్రం పూర్తయింది. మెయిన్ కెనాల్ కాలువలు పూర్తయ్యాయి. కానీ ప్రతి ఎకరాకు నీరు అందే విధంగా ఫీల్డ్ చానల్స్ లేకపోవడంతో, ప్రాజెక్టు ఉన్న పంటలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వం మెయిన్ కెనాల్ నుంచి డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్, మైనర్ కెనాల్స్, సబ్ మైనర్, ఫీల్డ్ చానల్స్ కాలువల కోసం భూ సేకరణ చేసి, నీరు అందించాల్సి ఉంది. వీటికోసం సుమారు రూ.200 కోట్లు అవసరం అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ బడ్జెట్‌లో నైనా ఈ కాలువల కోసం నిధులు కేటాయించి భూసేకరణ చేస్తారా అని రైతులు అడుగుతున్నారు.

చానల్స్ నిర్మిస్తేనే రైతులకు లాభం



రంగనాయక సాగర్ ప్రాజెక్టు నిర్మించారు. లక్ష యాభై వేల ఎకరాలకు సాగునీరు అందిస్తా అన్నారు. కేవలం పెద్ద కాలువలు మాత్రమే తవ్వారు. వాటి ద్వారా చెరువులు నింపుతు న్నారు. పిల్ల కాలువలు తవ్వకపోవడంతో పంటలు ఎండిపో తున్నాయి. ప్రాజెక్టు ఉండి కూడా లాభం లేదు. ప్రభుత్వ భూ సేకరణ చేసి పిల్ల కాలువలను తవ్వి, ప్రతి ఎకరాకు నీరు అందే విధంగా చూడాలి.

-తిరుపతి రెడ్డి, రైతు.

సబ్జెక్టుపై అవగాహన పెంచుకోవాలి

- అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

విద్యార్థులు చదువును కష్టంగా కాకుండా సబ్జెక్టుపై అవగాహన పెంచుకోవాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ సూచించారు. గురువారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రాఘవాపూర్ కస్తూర్బా పాఠశాలను సందర్శించారు. వంటగది తరగతి గదులు శానిటేషన్ పాఠశాల ఆవరణ వంటివి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన మంచి భోజనం పెట్టాలని పాఠశాల చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలు ఉన్నాయి కాబట్టి కష్టంగా కాకుండా ఇష్టంగా చదివి భవిష్యత్తును మంచి మార్గంలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, జెడ్పీ సీఈవో రమేష్, ఎంపీడీవో మురళీధర్ శర్మ మండల వైద్యాధికారి బాపురెడ్డి, ఎంఈఓ రాజిరెడ్డి, పాఠశాల ఇన్చార్జి స్పెషల్ ఆఫీసర్ లక్ష్మి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల కనికరం లేదు

- రైతుల నోటికాడికి వచ్చిన పంటలు ఎండిపాయే..
- వెండిపోయిన పంటలను సర్వే చేసి ఎకరాకు రూ. 50 వేలు నష్టపరిహారం చెల్లించాలి
- రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి



నవతెలంగాణ-చేర్యాల

కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల కనికరం లేదని, నీళ్ల లేక రైతుల నోటికాడికి వచ్చిన పంటలు ఎండిపోయాయని తెలంగాణ రైతు సంఘం సిద్దిపేట జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. మండల పరిధిలోని నాగపురి, సుభాష్ గూడెం గ్రామాల్లో గురువారం తెలంగాణ రైతు సంఘం బృందం ఎండిపోయిన వరి చేనులను పరిశీలించారు. ఈ సందర్భంగా శెట్టిపల్లి సత్తిరెడ్డి మాట్లాడుతూ.. రైతులు వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి వరి పంటలు వేస్తే నోటికి వచ్చిన వరి పంటలు పూర్తిగా ఎండిపోయి అప్పుల పాలైన పరిస్థితి దాపురించిందన్నారు. దీనికి కారణం ప్రభుత్వం ముందస్తు ప్రణాలిక లేకపోవడంతో జరుగుతుందని, దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా తపస్ పల్లి రిజర్వాయర్ నింపి ఈ ప్రాంతంలోని చెరువులు, కుంటలు నింపితే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. తపాస్ పల్లి రిజర్వాయర్ తో ఈ ప్రాంత చెరువులు, కుంటలు నింపి రైతుల పొలాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఎండిపోయిన చేన్లను సర్వే చేయించి ప్రతి ఎకరాకు 50 వేల రూపాయలు చొప్పున నష్టపరిహారం రైతులకు చెల్లించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ తేలు ఇస్తారి, రైతు సంఘం మండల అధ్యక్షులు మోకు దేవేందర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ జన్మనిచ్చిన వర్గల్ అభివృద్ధికి ప్రాధాన్యత

- ఆర్థిక కష్టాలున్నా పేదల సంక్షేమం,
- రాష్ట్రంలో అద్భుత ప్రగతికి బాటలు వేస్తున్న కాంగ్రెస్ సర్కార్
- డీసీసీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి




నవతెలంగాణ-వర్గల్

రాజకీయ జన్మనిచ్చిన వర్గల్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని, ఇక్కడి ప్రజల సంక్షేమం, అభివృద్ధి తన ప్రధాన లక్ష్యమని డీసీసీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గురువారం వర్గల్ ఎస్సీ వాడలో రూ.40 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత కేసీఆర్ ప్రభుత్వ పాపాలు గజ్వేల్ పాలిట శాపాలుగా మారాయని ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక కష్టాలు అధిగమిస్తూ సీఎం రేవంత్ రెడ్డి అద్భుత ప్రగతి సాధిస్తుండగా, అడిగిన వెంటనే గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.5 కోట్లు కేటాయించినట్లు స్పష్టం చేశారు. దీర్ఘకాలిక, శాశ్వత ప్రయోజనాలు లక్ష్యంగా గజ్వేల్ అభివృద్ధి కోసం రూ 200 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలతో మల్లన్న సాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ల నుండి పంటలకు సాగునీరు అందించే చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోహన్, మండల పార్టీ అధ్యక్షులు సందీప్ రెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గజ్వేల్ ప్రవీణ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏ హోదా ఉందని కొబ్బరికాయలు కొడతారు..?

- వెంటిలేటర్ పై రేవంత్ సర్కార్
- ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పేరిట కొబ్బరికాయలు కొడుతున్న వ్యక్తులకు ఏ హోదా ఉన్నదని ఎఫ్డీసీమాజీ చైర్మెన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రోటకాలు లేని వ్యక్తులు కొబ్బరికాయలు కొడుతుండగా అధికారులు ఏం చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి పరిపాలన వెంటిలేటర్‌పై కొనసాగుతుందని ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లక్షల ఎకరాల పంటలను ఎండబెడుతుందని సాగునీరు ఇవ్వడంలేదని ఆవేదన చెందారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఇప్పటికే 50 వేల ఎకరాల వరి పంట ఎండిపోయిందని అన్నారు. సాగునీరు అందకపోవడం వల్ల రైతులకు నష్టం జరుగుతుందన్నారు. తెలంగాణలో పంటలు ఎండిపోతున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు మద్దూరు శ్రీనివాస్ రెడ్డి, కృష్ణారెడ్డి, బెండ మధు, గంగిశెట్టి రవి,నవాజ్ మీరా తదితరులు పాల్గొన్నారు.

అంగడిలో గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి

- బీఎస్పీ నాయకులు మున్సిపల్ ఎదుట నిరసన



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

దేశంలో1961లో తీసుకు వచ్చిన గోవధ నిషేధ చట్టాన్ని హుస్నాబాద్ పట్టణంలో జరిగే వారసంత అంగడిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం బీఎస్పీ నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. హుస్నాబాద్ ఎమ్మెల్యే, మంత్రి, కేంద్ర మంత్రి నిత్యం గోమాతను పూజిస్తారు కానీ చట్టాన్ని అమలు చేయడం లేదన్నారు. అంగడిలో ఆరోగ్యంగా ఉండి 20 ఏళ్లు బతికే అవకాశం ఉన్నా గోవులను, ఎద్దులను, బర్రెలను, దూడలను, దున్నలను వెటర్నరీ డాక్టర్ అనుమతి లేకుండా మెదక్‌లోని పశువధశాలకు అక్రమంగా తరలిస్తున్నారన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. గోవధ నిషేధ చట్టం అమలు చేయకపోతే ఆందోళన కార్యక్రమం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జ్ , రైతు సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్, గో సంరక్షక నాయకురాలు కోడూరు శ్రీదేవి, బిఎస్పి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలగందుల శంకర్, నియోజకవర్గ అధ్యక్షులు వెలుపల రాజు, నాయకులు పాల్గొన్నారు.

అంకిరెడ్డిపల్లిలో నిరుపేద కుటుంబానికి చేయూత

- అంత్య క్రియల కోసం యూత్ సభ్యులు, యువకుడు రూ.40 వేలు అందజేత



నవతెలంగాణ-కొండపాక

అనారోగ్యంతో వ్యవసాయ కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని అంకిరెడ్డి పల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన రాసుల యాదగిరి రావు (49) తనకు గల ఒక ఎకరం భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. కుటుంబ పోషణకు ఆర్థిక పరిస్థితి బాగాలేక నిత్యం కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మూడేళ్ల క్రితం కూతురు వివాహం కాక కుటుంబ కలహాలతో చనిపోగా అప్పుల పాలయ్యాడు. మృతిని ఆరోగ్యం బాగాలేక ఆసుపత్రి ఖర్చుల కోసం కుటుంబ సభ్యులు దాదాపు రూ.4 లక్షల వరకు అప్పులు చేశారు. దీంతో నిరుపేద కుటుంబానికి గ్రామానికి చెందిన శివాజీ యూత్ సభ్యులు రూ.20 వేలు, గ్రామానికి చెందిన యువకుడు రాసుల అనిల్ కుమార్ రూ.20 వేల ఆర్థిక సాయంతో అంత్య క్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో శివాజీ యూత్ అధ్యక్షులు రంజిత్ కుమార్, ఎర్వాడి శ్రీనివాస్, మధు సుదన్, రాసుల నరేందర్ , కుసుంబ నవీన్ తో పాటు గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన పూజల



నవతెలంగాణ-నంగునూరు

మండలంలోని నర్మెట గ్రామంలో రూ.25 లక్షలు, మగ్దుంపూర్ రూ.30 లక్షలు, సిద్దన్నపేట రూ.30 లక్షలు, పాలమాకుల రూ.30 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మంజూరు అయినా సీసీ రోడ్ల నిర్మాణం కోసం సిద్దిపేట నియోజకవర్గం ఇంచార్జి పూజల హరికృష్ణ పనులు ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గం లో ప్రతి గ్రామం, ప్రతి పల్లెను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతానని కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి గ్రామాల అభివృద్ధి యే లక్ష్యం గా పెట్టుకున్నారున్నారు. అందులో భాగంగా నంగునూరు మండల అభివృద్ధి కోసం నాలుగు కోట్ల ముప్పై లక్షల రూపాయలు మంజూరు చేయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు తప్పెట శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అచ్చిన సత్తయ్య, నాయకులు బొమ్మల యాదగిరి, ఎల్లం యాదవ్ డీసీసీ మహిళా అధ్యక్షులు ముద్దం లక్ష్మి,స్టేట్ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ పూజల గోపికృష్ణ, తదితరులు పాల్గొన్నరు.

సీఎం సారు ఒకసారి ఇటు వైపు చూడండి

- మల్లన్న సాగర్ నిర్వాసితుల వినతి
- సమస్యల పరిష్కారానికి రూ.150 కోట్లు కేటాయించండి

నవతెలంగాణ-గజ్వేల్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారు ఇటువైపు చూడండి అంటూ నిర్వాసితులు ఆయన పర్యటన కోసం ఎదురు చూస్తున్నారు. గతంలో నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ప్రతిపక్ష హోదాలో ధర్నా చేసిన సీఎం రేవంత్ రెడ్డి అప్పటి మాటలు మర్చిపోయినట్లు కనిపిస్తుంది. గజ్వేల్ పట్టణంలో నిర్మించిన మల్లన్న సాగర్ కాలనీలో నిర్వాసితుల సమస్యలు పరిష్కార దిశగా ప్రభుత్వం ప్రయత్నం చేయడం లేదనే విమర్శలు ఎదుర్కొంటోంది. కాలనీలో నివసిస్తున్న నిర్వాసితులకు సమస్యలు జటిలమవుతున్నాయి. దీంతో నిర్వాసితులు వరుస నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాలు కల్పించడంలో గత ప్రభుత్వం ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మాజీ మంత్రి హరీశ్‌రావు సైతం మల్లన్న సాగర్ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రికి లేఖ రాశారు. అయినా ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేకపోవడం వల్ల నిర్వాసితులు అసంతృప్తికి గురవుతున్నారు.

గత అసెంబ్లీ ఎన్నికల ముందు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి రూ 100 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధుల విడుదలకు నిర్వాసితుల కాలనీ నోచుకోకపోవడం వల్ల ఇప్పుడు అనేక సమస్యలు నిర్వాసితులు చుట్టూ బిగిస్తున్నాయి. ప్యాకేజీలు, పరిహారాలు కాకుండా ఆనందా రు కాలినికి స్మశాన వాటిక లేకపోవడం వల్ల ప్రధాన సమస్యగా మారింది. నిర్వాసితుల్లో పలు సామాజిక వర్గాల చెందిన కుటుంబాలు నివసిస్తున్న క్రమంలో వారికి సామాజిక వర్గాలుగా స్మశానవాటికలు నిర్మించలేక పోయారు.

రూ.150 కోట్లు ఇవ్వండి: నిర్వాసితులు

మల్లన్న సాగర్ నిర్వాసితులకు గత ప్రభుత్వం పెండింగ్లో ఉన్న సమస్యల పరిష్కారకి రూ.100 కోట్లు మంజూరు చేసి పోయింది. వాటితోపాటు మరో 50 కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేస్తే మౌలిక సదుపాయాలు ఇతర సంస్థల పరిష్కారం జరిగే అవకాశం ఉందని నిర్వాసితులు అంటున్నారు. నిధులు మాత్రం ఇప్పటివరకు మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.



ఇష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలి : సీఐలు

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్



విద్యార్థి దశ చాలా ముఖ్యమైనదని ఇష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలని, సోషల్ మీడియా, సినిమాలకు అట్రాక్టివ్ అయి జీవితాలు నాశనం చేసుకోవద్దని గజ్వేల్ సీఐ బి.సైదా, ట్రాఫిక్ సీఐ మురళి అన్నారు. గురువారం గజ్వేల్ పట్టణంలోని గీతాంజలి హై స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులకు అంటి డ్రగ్స్, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సీఐలు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థినిలు ట్రాఫిక్ రూల్స్ ను తెలుసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థిని గుడ్ టచ్ బాడ్ టచ్, ఈవిటీజింగ్,గంజాయి, మత్తు పదార్థాలు డ్రగ్ దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని,అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. గ్రామాలలో ఎవరైనా అనుమానాస్పదంగా కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. వెంటనే డయల్ 100సిద్దిపేట షీటీమ్ వాట్సప్ నెంబర్ 8712667434 స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ 9494639498, మహిళా పోలీస్ స్టేషన్ సిద్దిపేట 8712667435 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపల్ కవిత, ఉపాధ్యాయులు, గజ్వేల్ షీటీమ్ బృందం శ్రీరాములు ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుల్ లావణ్య, కానిస్టేబుల్ మహేష్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.